RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా నిజన్
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:28 SATURDAY ,MAY 30,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :28 శనివారం , మే 30, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## తడిసిన ధాన్యం సహా ప్రతి గింజనూ కొంటాం: ఉత్తమ్ కుమార్ రెడ్డి



తెలంగాణ పత్రిక ప్రతినిధి

ధాన్యం కొనుగోళ్ల అంశం పై ప్రతిపక్షాలు కావాలనే రాజకీయ విమర్శలు చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం వరి కొనుగోలు కోసం చేస్తున్నంత ఖర్చు భారతదేశ చరిత్రలో ఏనాడూ ఏ ప్రభుత్వమూ చేయలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే అంగీకరించిందని గుర్తు చేశారు. - మిగతా2లో

# ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కారు శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిల తొలి విడత మొత్తాన్ని విడుదల చేశారు. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈరోజు తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. - మిగతా2లో



## పేలిపోయిన న్యూ గ్లెన్ రాకెట్.. ఎక్స్ వేదికగా స్పందించిన బ్లూ ఆరిజిన్..

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఫ్లోరిడాలోని కేప్ కెనవరల్‌లో గురువారం నాడు బ్లూ ఆరిజిన్‌కు చెందిన న్యూ గ్లెన్ రాకెట్ పేలిపోయింది. ప్రయోగ వేదిక నుంచి అంతరిక్షంలోకి పంపేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని బ్లూ ఆరిజిన్ సంస్థ తెలిపింది. హాట్ ఫైర్ పరీక్ష - మిగతా2లో



## యూపీఎస్సీని చూసి నేర్చుకోండి.. నీట్ పేపర్ లీక్ పై 'సుప్రీం' వ్యాఖ్య

తెలంగాణ పత్రిక ప్రతినిధి

నీట్ పేపర్ లీక్ ఉదంతం పై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు తాజాగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పై (ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. సివిల్స్ పరీక్షలు నిర్వహించే యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడ లేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. - మిగతా2లో



## ప్రతి ఓటును కాపాడుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్



తెలంగాణ పత్రిక ప్రతినిధి

దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మిగిలిపోయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియను - మిగతా2లో

## స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి హాజరైన కడియం శ్రీహరి



2

- నూతన కో ఆప్షన్ సభ్యులను సత్కరించిన శ్రీహరి
- ఒక్కో వార్డుకు రూ. 10 లక్షలు మంజూరు చేయనున్నట్టు వెల్లడి
- వార్డులో అవసరమైన పనులను గుర్తించాలని సూచన

## పవన్ కల్యాణ్ పై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్‌ను ఒక 'ప్యాకేజ్ స్టార్' అని అభివర్ణిస్తూ, భవిష్యత్తులో వైఎస్ జగన్ ఎక్కువ ప్యాకేజీ ఇస్తే ఆయనకు మద్దతు ఇవ్వడానికి కూడా వెనుకాడరని ఎద్దేవా చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన ఈ - మిగతా2లో



## హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు... 'ఈగిల్ టీమ్' పేరిట విధులు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం, సమాజంలో మార్పునకు నాంది పలుకుతోంది. హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించి, వారి - మిగతా2లో



## సిద్ధరామయ్య రాజీనామా..

తెలంగాణ పత్రిక ప్రతినిధి

కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేసిన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ పదవుల కన్నా పార్టీకి, ప్రజలకే అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు.

- మిగతా2లో



## ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

-మొదటిపేజీ తరువాయి

ఈ నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను కూడా పూర్తిగా చెల్లించారు. ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి తమ ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోందని వెల్లడించింది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపుతున్నదనడానికి ఇది నిదర్శనమని, ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## యూపీఎస్‌సీని చూసి నేర్చుకోండి.. నీట్ పేపర్ లీక్ పై 'సుప్రీం' వ్యాఖ్య

-మొదటిపేజీ తరువాయి

యూపీఎస్‌సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. కోర్టు విచారణకు ఎన్‌టీఏ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు ఏర్పాటైన హైలెవెల్ కమిటీ ఛైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ ఎలా లీక్ అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య తలెత్తిందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలనూ సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దాని పై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21న నిర్వహించనున్న పరీక్ష కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

### ప్రతి ఓటును కాపాడుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్

-మొదటిపేజీ తరువాయి

ఈసీ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియ సమయంలో అనుసరించాల్సిన తీరుపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తమ నేతలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గాంధీ భవన్ ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ మాస్టర్ ట్రైనీలకు ఏఐసీసీ శిక్షణ విభాగానికి సంబంధించిన సౌరభ్, అనూష, నిశాంత్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో బీఎల్‌ఏలకు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియను పకడ్బందీగా చేశామని వెల్లడించారు. జిల్లా కమిటీలు, మండల కమిటీలు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. పశ్చిమబెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారని.. బీజేపీ చేసిన కుట్రలతో అక్కడ ప్రభుత్వమే మారిపోయిందని మండిపడ్డారు. తెలంగాణలో అలాంటి కుట్రలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు.

## పవన్ కల్యాణ్ పై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్

-మొదటిపేజీ తరువాయి

రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను విమర్శించే స్థాయి, అర్హత పవన్ కల్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి అన్నారు. "దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయండి. ఆయన ఇంటి ముందు నేను అడ్డుగా నిలబడతా" అంటూ పవన్‌కు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ బిడ్డల జోలికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరైనా రావాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే మళ్లీ 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మొదలవుతుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏపీ రాజకీయ నేతల తీరుపై ఆయన మండిపడ్డారు. "మీరంతా ఉండేది హైదరాబాద్‌లో, ఆస్తులు సంపాదించుకునేది ఇక్కడే. మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?" అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదని, తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.

## తడిసిన ధాన్యం సహా ప్రతి గింజనూ కొంటాం: ఉత్తమ్ కుమార్ రెడ్డి

-మొదటిపేజీ తరువాయి

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా వరి కొనుగోళ్లు జరపడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని మంత్రి వెల్లడించారు. రైతులను ఆదుకుంటామంటూ బీజేపీ నాయకులు క్షేత్రస్థాయిలో నాటకీయ నిరసనలు చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల విధానం ప్రకారమే తాము ధాన్యాన్ని సేకరిస్తున్నామని, రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ యాసంగి సీజన్ పంటలో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిందని, అందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఇందులో కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ముందే చెప్పిందని వెల్లడించారు. మిగిలిన అదనపు ధాన్యాన్ని రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వమే అప్పు చేసి మరి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ యాసంగి పంటలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అక్కడ రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఇప్పటికే రూ.13,050 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇసుక లారీలను, అలాగే ఇతర ఫ్యాక్టరీల్లో నడిచే భారీ వాహనాలను కూడా ధాన్యం సేకరణకు ఉపయోగించాలని భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందుకోసం వాహనాలను కేటాయించాలని ఆయా యాజమాన్యాలను కోరినట్లు తెలిపారు. అయితే, ప్రస్తుతం హమాలీల కొరత కొంత వేధిస్తోందని, బీహార్, బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులపైనే ఇందుకు ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందని మంత్రి వివరించారు. ఈ ఇబ్బందులను కూడా అధిగమించి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## పేలిపోయిన న్యూ గ్లెన్ రాకెట్.. ఎక్స్ వేదికగా స్పందించిన బ్లూ ఆరిజిన్..

-మొదటిపేజీ తరువాయి

సమయంలో అసాధారణ పరిస్థితిని ఎదుర్కొన్నామని.. సిబ్బంది అందరూ సురక్షితంగానే ఉన్నారని ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. న్యూ గ్లెన్ రాకెట్ లాంచింగ్‌కు సిద్ధంగా ఉండగా కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అయితే, ఆకాశంలోకి దూసుకెళ్లాల్సిన క్షణాలకు ముందే రాకెట్ దిగువ భాగం నుంచి దట్టమైన పొగ వచ్చింది. క్షణాల వ్యవధిలోనే పేలుడు సంభవించి భారీ అగ్నిగోళం ఏర్పడింది. దీంతో ప్రయోగ వేదిక మొత్తం మంటల్లో చిక్కుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ప్రమాదంపై బ్లూ ఆరిజిన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ స్పందించారు. 'ఇది చాలా కఠినమైన రోజు. అవసరమైన ప్రతిదాన్ని మళ్లీ నిర్మించి, తిరిగి ప్రయోగాలకు సిద్ధమవుతాం. అంతరిక్ష ప్రయాణం కోసం ఈ ప్రయత్నం విలువైనదే' అంటూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. మరోవైపు ఈ ఘటనపై స్పేస్ ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ స్పందించారు. ఈ ప్రమాదం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. న్యూ గ్లెన్ పేలుడుపై ఫ్లోరిడాకు చెందిన కాంగ్రెస్ సభ్యుడు మైక్ హారిడోపోలోస్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి సంబంధించి నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మన్‌తో తాను సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. నాసా, బ్లూ ఆరిజిన్ కలిసి ఆర్టెమిస్ చంద్రయాన్ మిషన్ల కోసం లూనార్ ల్యాండర్ అభివృద్ధిపై పనిచేస్తున్నాయి. దీంతో ప్రమాదంపై నాసా కూడా దర్యాప్తును పర్యవేక్షించనున్నట్లు తెలుస్తోంది. ఈ తాజా పేలుడుతో బ్లూ ఆరిజిన్ సంస్థకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. భవిష్యత్ అంతరిక్ష వాణిజ్యం, చంద్రయాన్ మిషన్లలో న్యూ గ్లెన్ రాకెట్ కీలక పాత్ర పోషించాల్సి ఉంది. అయితే, ఈ ఘటనతో బ్లూ ఆరిజిన్ సంస్థ ప్రణాళికలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి హాజరైన కడియం శ్రీహరి

-మొదటిపేజీ తరువాయి

స్టేషన్ ఘన్ పూర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందరధంగా మున్సిపాలిటీ నూతన కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన రహీమున్నిసా, మాషుఖ్, గన్ను నర్సింహులు, బూర్ల లతలను శాలువాతో సత్కరించారు. మరోవైపు, నూతన కోఆప్షన్ సభ్యులకు మున్సిపల్ కమిషనర్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ... కౌన్సిల్ లో ఓటు వేసే హక్కు తప్ప కౌన్సిలర్లకు ఉండే అన్ని హక్కులు కో ఆప్షన్ సభ్యులకు ఉంటాయని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులకు జూన్ 15 నాటికి ఒక్కో వార్డుకు రూ. 10 లక్షలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. మీ వార్డులో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలకు ముందే స్టేషన్ ఘన్ పూర్ కి రూ. 50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని... రూ. 8 కోట్ల జనరల్ ఫండ్ ఉందని శ్రీహరి తెలిపారు. జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి ఇప్పుడు దాదాపు రూ. 60 కోట్ల నిధులతో స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటీ సంపన్నంగా ఉందని అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన సిబ్బందికి జీతాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్, మే నెల పెండింగ్ జీతాలను కూడా జూన్ 1న చెల్లించాలని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అవినీతి రహిత పాలనను అందిస్తూ మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

## హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు...

# 'ఈగిల్ టీమ్' పేరిట విధులు

-మొదటిపేజీ తరువాయి

ఈ బృందంలో 11 మంది ట్రాన్స్ మహిళలు, ఐదుగురు ట్రాన్స్ పురుషులు ఉన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలను తొలగించడంలో వీరు చురుగ్గా పాల్గొంటున్నారు. కబ్జాదారులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా భయపడకుండా, నిర్భయంగా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. వీరిని 'హైడ్రా ఈగిల్ టీమ్'గా పిలుస్తున్నారు. ఈ ఉద్యోగం తమకు కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, జీవితానికి కొత్త గుర్తింపును, ఆత్మగౌరవాన్ని ఇచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా యూనిఫాం ధరించి విధులకు హాజరవడం తమకు ఎంతో గర్వకారణమని చెబుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్‌లో 862 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని, మాదాపూర్‌లోని ఎదులకుంట చెరువును కబ్జాదారుల బారి నుంచి కాపాడటంలో ఈ బృందం కీలక పాత్ర పోషించింది. కబ్జాల తొలగింపు సమయంలో ప్రజలకు నచ్చజెప్పడం, మహిళలతో మాట్లాడి ఉద్రిక్తతలు తగ్గించడం, అధికారులు-ప్రజల మధ్య సమన్వయం చేయడంలో వీరు అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని హైడ్రా అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు. "గతంలో బతుకుదెరువు కోసం అడుక్కునేవాళ్లం. ఎక్కడికి వెళ్లినా హేళన చేసేవారు. పని అడిగితే ముఖం మీదే లేదనేవారు. కానీ, ఇప్పుడు యూనిఫాంలో విధులకు వెళుతుంటే అందరూ మర్యాదగా మాట్లాడుతున్నారు" అని తాన్సి రాయ్ ఆనందంగా చెప్పారు. "అవకాశం ఇస్తే ట్రాన్స్‌జెండర్లు ఏ రంగంలోనైనా రాణించగలరు. హైడ్రాలో మా విధులే దీనికి నిదర్శనం. ఇక్కడ అధికారులు, ఇతర సిబ్బంది మమ్మల్ని సమానంగా చూస్తారు" అని గాయత్రి తెలిపారు. ఈ ఉద్యోగం వల్ల వీరు ఇప్పుడు ఆర్థికంగా స్థిరపడి, తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా 'మేము కూడా సమాజానికి సేవ చేయగలం' అనే ఆత్మవిశ్వాసం వారిలో వెల్లివిరుస్తోంది.

# సిద్ధరామయ్య రాజీనామా..

-మొదటిపేజీ తరువాయి

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో ఆయన ఒక పోస్ట్ చేశారు. "వ్యక్తి కన్నా పార్టీ గొప్పది, అధికారం కన్నా ప్రజలే ముఖ్యం. ఎందుకంటే కాంగ్రెస్‌కు పార్టీయే కుటుంబం, ప్రజలే మా లక్ష్యం" అని అందులో పేర్కొన్నారు. సిద్ధరామయ్య రాజీనామాను కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ఆమోదించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆయనను కోరారు. కర్ణాటకలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల మధ్య పార్టీ క్రమశిక్షణ, సమష్టి నాయకత్వాన్ని చాటిచెప్పేందుకే వేణుగోపాల్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ప్రియాంక్ ఖర్గే మాట్లాడుతూ.. సంక్షేమ పాలన, సైద్ధాంతిక నిబద్ధత, రాజకీయ పోరాటాలతో ప్రజల ప్రేమను, నమ్మకాన్ని గెలుచుకున్న నేత సిద్ధరామయ్య అని ఆయన కొనియాడారు. కర్ణాటకలో ఎక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రుల్లో ఒకరిగా రికార్డు సృష్టించారని, కాంగ్రెస్ పార్టీ ప్రజానుకూల కార్యక్రమాలతో ఆయన ప్రజల నాయకుడిగా ఎదిగారని అన్నారు. "రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, సామ్యవాద సూత్రాలకు కట్టుబడి ఆయన ఉన్నత ప్రమాణాలను నెలకొల్పారు. మా తరం నేతలకు, భవిష్యత్ యువ రాజకీయ నాయకులకు ఆయన ఒక స్ఫూర్తి" అని ప్రియాంక్ ఖర్గే పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో సిద్ధరామయ్య మార్గదర్శకత్వాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన నాయకత్వంలో అవినీతి రహిత, అభివృద్ధి ఆధారిత పాలన అందిందని, గ్యారంటీ పథకాలతో ప్రజలకు ఆర్థిక సాధికారత కల్పించామని తెలిపారు. అలాంటి గొప్ప నేత కేబినెట్‌లో మంత్రిగా పనిచేయడం గర్వకారణమని ఖర్గే వ్యాఖ్యానించారు.

# జగిత్యాలలో రాజకీయ ఉద్రిక్తత





-కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముఖేష్ కన్నా హౌస్ అరెస్ట్

జగిత్యాల ప్రతినిధి, మే 29, (తెలంగాణ పత్రిక ):

జగిత్యాలలో కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో చేపట్టిన బహిరంగ చర్చ కార్యక్రమానికి వెళ్తున్న కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజి ముఖేష్ కన్నాతో పాటు పలువురు సేవాదళ్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు శుక్రవారం గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా బోగోజి ముఖేష్ కన్నా మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా బీజేపీ జగిత్యాల ఇన్‌చార్జిగా చెప్పుకుంటున్న భోగ శ్రావణి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఆరోపణలు చేస్తే ఆధారాలు చూపాలని, ప్రజల ముందు బహిరంగంగా చర్చకు రావాలని కాంగ్రెస్ సేవాదళ్ తరపున అధికారికంగా సవాల్ విసిరినట్లు తెలిపారు. పాత్రికేయుల సమక్షంలోనే బహిరంగ చర్చకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి, తేదీ, సమయం ప్రకటించినప్పటికీ భోగ శ్రావణి చర్చకు హాజరుకావడానికి ధైర్యం చేయలేదన్నారు. ప్రజల ముందుకు వచ్చి నిజాలు చెప్పే ధైర్యం లేకపోవడంతో రాత్రి వేళల్లో దొంగచాటుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద స్టిక్కర్లు వేయించడం ఆమె పిరికితనానికి నిదర్శనమని తీవ్రంగా విమర్శించారు. అంతేకాకుండా ఆ స్టిక్కర్లపై బీజేపీ పేరు లేకుండా "జగిత్యాల ప్రజలు" పేరుతో ప్రచారం చేయడం ద్వారా బీజేపీ నాయకులే ఆమె చర్యలకు మద్దతు ఇవ్వలేని పరిస్థితి ఉందని స్పష్టమవుతోందన్నారు . తన అవినీతి బయటపడుతుందనే భయంతోనే భోగ శ్రావణి ప్రత్యక్ష చర్చకు దూరంగా ఉంటోందని ఆరోపించారు. భోగ శ్రావణి చేసిన ఆరోపణలపై ఆధారాలు ఉంటే ప్రజల ముందుకు తీసుకురావాలని, లేకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతి పేరుతో డ్రామాలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే కాంగ్రెస్ సేవాదళ్ చూస్తూ ఊరుకోదన్నారు. జగిత్యాల ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ విజయవంతం కావని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని, ఎవరైనా ప్రజాప్రతినిధులపై లేదా నాయకులపై ఆరోపణలు చేస్తే వాటిని నిజానిజాలతో ప్రజల ముందుకు తీసుకురావాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా బురదజల్లే రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ భయపడదని అన్నారు. భోగ శ్రావణి అవినీతిపై కాంగ్రెస్ సేవాదళ్ తరపున ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రజాక్షేత్రంలో ప్రతి విషయాన్ని బయటపెడతామని ముఖేష్ కన్నా హెచ్చరించారు. ప్రజల మధ్యకు వెళ్లి నిజాలు వివరిస్తామని, అసత్య ప్రచారాలను తిప్పికొడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, నాగభూషణం, గంగాధర్, జగదీష్, వినోద్, మహేష్ కుమార్, ప్రతాప్, శ్రావణ్ తదితర కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన గోడపత్రిక ఆవిష్కరణ

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మే 29,(తెలంగాణ పత్రిక)

గచ్చిబౌలిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించే గోడపత్రిక (స్టిక్కర్) ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా మరియు శిశు భద్రత విభాగం గచ్చిబౌలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎం. లక్ష్మారెడ్డి హాజరై గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ప్రత్యేక నినాదంతో నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ఏడాది నినాదం "నికోటిన్ మరియు పొగాకు వ్యసనాన్ని ఎదుర్కోవాలని పిలుపు" అని పేర్కొన్నారు. పొగాకు మరియు దాని ఉత్పత్తుల వినియోగం వలన ప్రజల ఆరోగ్యం, సమాజం, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 80 లక్షలకు పైగా మరణాలు పొగాకు కారణంగానే సంభవిస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు చెబుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువత ధూమపానానికి ఆకర్షితులవుతున్నారని, దీనివల్ల ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత సమస్యలు, క్యాన్సర్, క్షయ, అల్సర్, దంత సమస్యలు వంటి అనేక అనారోగ్యాలు వస్తున్నాయని వివరించారు. పొగాకులోని నికోటిన్ రక్తపోటు, పక్షవాతం, జ్ఞాపకశక్తి కోల్పోవడం వంటి తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరించారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం సుమారు 13.5 లక్షల మంది స్మోకింగ్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, హుక్కా, పాన్ పరాగ్ వంటి ఉత్పత్తులను వినియోగించే వారితో పాటు పక్కన ఉండి పొగ పీల్చేవారికి కూడా ప్రమాదం ఉంటుందని, దీనినే "సెకండ్ హ్యాండ్ స్మోకింగ్" అంటారని తెలిపారు. పొగాకు అలవాటును మానాలనుకునే వారు ఆరోగ్యకరమైన ఆహారం, పండ్ల రసాలు, ఎక్కువ నీరు, యోగా, ధ్యానం వంటి మంచి అలవాట్లను అలవరుచుకోవాలని సూచించారు. సంకల్పబలం ఉంటే ఎలాంటి చెడు అలవాట్లనైనా దూరం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎం. శ్రీహరిబాబు, కొత్తపల్లి కోటేశ్వరరావు, అమ్మయ్య చౌదరి, జి.వి. రావు, సత్యనారాయణ, వాణీ సాంబశివరావు, పాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు..



# బొంతుపల్లిలో శనిగకుంట వరద ప్రవాహానికి కల్వర్టు పనులు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ బావు సంపత్



-సంతోషం వ్యక్తపరుస్తున్న రైతు సోదరులు..

వీణవంక ప్రతినిధి, మే 29( తెలంగాణ పత్రిక).

వీణవంక మండలంలోని బొంతుపల్లి గ్రామంలోని శనిగకుంట వరద ప్రవాహానికి పైపులు వేసి,కల్వర్ట్ పనులను శుక్రవారం సర్పంచ్ బావు సంపత్,ఉప సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. గ్రామంలోని వివిధ అభివృద్ధి పనులకు గాను నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ పెద్దల దృష్టికి 2024 నవంబర్ 23న తీసుకుపోగా, ఎనిమిది లక్షలు కల్వర్ట్ కు 2025 సెప్టెంబర్ 18న, మంజూరవగా అట్టి పనిని శుక్రవారం ప్రారంభం చేసుకోవడం జరిగిందని, ఈ కల్వర్ట్ 60 ఎకరాల వ్యవసాయ భూములకు వెళ్లడానికి ఉపయోగ పడుతుందనీ బావు సంపత్ అన్నారు. మాజీ ఉప సర్పంచ్ చదువు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ. ఇట్టి పని మంజూరు చేసిన ప్రభుత్వానికి, హుజురాబాద్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ బాబు కి రైతుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకతీతంగా గ్రామంలో సమగ్ర అభివృద్ధి చేసుకోవాలనేదే మాఆలోచన అని,సమగ్ర అభివృద్ధిలో భాగంగా కానీసం 50 లక్షలు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలనీ ప్రభుత్వ పెద్దలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చదువు నర్సింహా రెడ్డి,పంచాయతీ కార్యదర్శి కే రజిత, కాంగ్రెస్ నాయకులు చదువు జైపాల్ రెడ్డి, రైతులు తాటికొండ గోవిందా చారి, రమేష్, పొన్నాల లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ తెలంగాణలో డిజిటల్ విప్లవానికి శ్రీకారం

-గిరిజన తండాలకు ఇంటర్నెట్ అందించడానికి సీఎం సిద్ధం.

-మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలా రెడ్డి

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 29:



తెలంగాణలోని ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్నెట్ అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి తెలిపారు. కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మారుమూల గిరిజన తండాల వరకు ఇంటర్నెట్, మొబైల్ కనెక్టివిటీ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నిర్మలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టి ఫైబర్ ప్రాజెక్టును కేంద్ర పథకాలతో అనుసంధానం చేసి ప్రతి ఇంటికీ డిజిటల్ సేవలు అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృతనిశ్చయాశీతో ఉన్నారని చెప్పారు. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో టెలి మెడిసిన్ సేవలు మరింత సమర్థవంతంగా ప్రభుత్వం అమలు చేయనున్నదని నిర్మల రెడ్డి వివరించారు. రాష్ట్రంలో టెలికాం విస్తరణకు, కొత్త టవర్ల ఏర్పాటుకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర మంత్రి రాష్ట్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చారని ఆమే తెలిపారు. గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని,సాంకేతికత పల్లెలకు చేరినప్పుడే అసలైన అభివృద్ధి అని నిర్మల రెడ్డి పేర్కొన్నారు.

## ఇల్లంతకుంటలో 11వ రోజుకు చేరిన వీఓఏల దీక్ష

-మోకాళ్లపై కూర్చొని నిరసన.. నీరసించిన వీఓఏలు



ఇల్లంతకుంట మే 29 తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో వీఓఏల నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరింది. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. కనీస వేతనం రూ.20 వేలు, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తింపు, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దీక్ష కొనసాగిస్తున్నారు. దీర్ఘకాలిక దీక్షతో పలువురు వీఓఏలు నీరసించిపోయారు. డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు గొడుగు బాలలక్ష్మి, కార్యదర్శి బంగారు అంజలి, కోశాధికారి మహంకాళి ఉమారాణితో పాటు మండల వీఓఏలు పాల్గొన్నారు.

## బిజిగిరీషరీఫ్ దర్గాను సందర్శించిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

జమ్మికుంట/వీణవంక ప్రతినిధి, మే 29( తెలంగాణ పత్రిక).





జమ్మికుంట మండలం బిజిగిరీషరీఫ్ దర్గాను శుక్రవారం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా మత పెద్దలు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. దర్గా ప్రాంగణంలో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే అక్కడి పరిస్థితులను పరిశీలించి, భక్తులకు అవసరమైన సౌకర్యాలపై మత పెద్దలతో మాట్లాడారు. బిజిగిరీషరీఫ్ దర్గా ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన స్థలమని పేర్కొన్న ఎమ్మెల్యే, దర్గా అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్ని మతాల పట్ల గౌరవ భావనతో ముందుకు సాగడం సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా దర్గాలో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మత పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వెజ్ నాన్ వెజ్ మార్కెట్ మున్సిపల్ అధీనంలోకి తీసుకోవాలి

**-మున్సిపల్ కమిషనర్ తో ఫోన్ మాట్లాడిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి.**

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 29



ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కమిషనర్ ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టారని పత్రికలలో చూశాను. ఇట్టి కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు అభినంది స్తున్నాను అని అన్నారు. జగిత్యాల పట్టణంలో వెజ్,నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు కొరకు గత బిఆర్ఎస్ పార్టీ హయాంలో జగిత్యాల అగ్రికల్చర్ మార్కెట్ పరిధిలో స్థలాన్ని సేకరించి 6 కోట్లకు పైగా నిధులు వెచ్చించి షెడ్ల నిర్మాణం చేశారు. నిర్మాణం పూర్తి చేసుకొని షెడ్లు కూడా 2023 సాధారణ ఎన్నికల ముందే ప్రారంభించుకున్నాం.దాదాపు 30 మాసాలు గడిచినప్పటికీ ఇప్పటివరకు షెడ్లు మున్సిపాలిటీ వినియోగంలోకి తీసుకోకపోవడమే కాకుండా సాధారణంగా ప్రారంభోత్సవం తర్వాత మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకోవాలి. ప్రారంభోత్సవం తదుపరి కూడా కాంట్రాక్టర్ గోదాం సిమెంట్, ఐరన్ స్టాక్ స్టోరేజ్ వ్యక్తిగతంగా వినియోగించుకుంటున్నారు. కావున కమిషనర్ పరిశీలించి మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకోవాలి. పట్టణ ప్రజలకు వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ఏ విదంగా వినియోగపడాలి అని నిర్ణయించండి. ఒకే సముదాయంలో మాంసం, చేపలు, కాయగూరలు, పండ్లు ఫలాలు అన్ని అందుబాటులోకి తీసుకువచ్చేటట్టు అప్పుడు టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణం చేసింది. నిర్మాణం పూర్తి చేసుకొని కూడా 3 సంవత్సరాలు గడుస్తుంది.ె షెడ్లను మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకోవాలి జగిత్యాల పట్టణ ప్రజలకు ఉపయోగపడేలాగా చూడండి. స్పందించిన మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ వెజ్,నాన్ వెజ్ మార్కెట్ పరిశీలించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్ గరిమ అగ్రవాల్

**-అపారెల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ వేగవంతం చేయాలి ధాన్యం తరలింపునకు సరిపడా వాహనాలు సమకూర్చాలి**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 29, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ధాన్యం కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం సేకరణ, అన్‌లోడింగ్ ప్రక్రియ, అపారెల్ పార్క్, గోదాములు, రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్, ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా శాఖల అధికారులతో శుక్రవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహి ంచారు. జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వర్షం కారణంగా ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామనే భరోసాను రైతులకు క్షేత్ర స్థాయిలో కల్పించాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, అన్‌లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో ఉన్న హమాలీలను అపారెల్ పార్క్‌కు తరలించి అక్కడ అన్‌లోడింగ్ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. దీంతో వాహనాలు త్వరగా ఖాళీ అయి ఇతర కేంద్రాలకు పంపే అవకాశం ఉంటుందని తెలిపారు.ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేసేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులను సూచించారు. వాహనాల కొరత లేకుండా సరైన పర్యవేక్షణ చేయాలని, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా చూడాలని ఆదేశించారు. తుది దశలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు అదనపు వాహనాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

## వివోఏల దీక్షకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్ యువ నాయకుడు లింగాల సందీప్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 29, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా కొనసాగుతున్న వివోఏల నిరసన దీక్షకు బీఆర్ఎస్ యువ నాయకుడు లింగాల సందీప్ మరియు స్వేరో కమిటీ సభ్యులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా లింగాల సందీప్ మాట్లాడుతూ గతంలో వివోఏలు దీక్షలు చేపట్టిన సమయంలో ప్రస్తుతం మంత్రి పదవిలో ఉన్న సీతక్క మద్దతు తెలిపి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధరతో పాటు జీవిత బీమా, ఆరోగ్య బీమా కల్పించి సెల్ఫ్ ఎంప్లాయిస్‌గా గుర్తిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా వివోఏల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వివోఏలకు కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించాలని, ఆరోగ్య భద్రతతో పాటు ప్రమాద బీమా అమలు చేయాలని, SERP ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన వివోఏలను సీసీలుగా గుర్తించాలని, జీవో 58ను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. శాంతియుతంగా కొనసాగుతున్న దీక్షల దశలోనే సమస్యలను పరిష్కరించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల మహేష్ గౌడ్, యువజన నాయకులు పంతులూరి సన్నీ, గడ్డమీది సాయి చందు, గుర్రాల రాజశేఖర్, పెంద్యాల బాలకిషన్, కొర్రి ప్రణయ్, పాశం ప్రశాంత్, బండి హరికృష్ణ, తోకల నవీన్, బడే మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

కరీంనగర్/వీణవంక ప్రతినిధి, మే 29( తెలంగాణ పత్రిక).



హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా హుజురాబాద్ పట్టణం, జమ్మికుంట పట్టణం సహా నియోజకవర్గంలోని హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, కమలాపూర్ ఐదు మండలాల్లో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించారు. వేసవి తీవ్రతతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రతి గ్రామానికి, ప్రతి కాలనీకీ తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన దళితబంధు పథకం రెండో విడతను త్వరితగతిన ప్రారంభించి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆలస్యం చేయకుండా అమలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.నియోజకవర్గ అభివృద్ధికి కీలకమైన వీణవంక మండల కేంద్రం లోని డబుల్ రోడ్డు,రాచపల్లి రోడ్డు, పోతిరెడ్డిపల్లి రోడ్డు, కోర్కల్ రోడ్డు, నాగంపేట రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ రోడ్ల దుస్థితి కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులు పండించిన మొక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు కల్పించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి నిజమైన అర్హులైన పేద కుటుంబాలకు అందజేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కూడా రాజకీయాలకు అతీతంగా నిజమైన పేదలను గుర్తించి ఎంపిక చేయాలని సూచించారు. హుజురాబాద్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను కూడా కలెక్టర్‌కు వివరించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

## గ్రామ గ్రామాన ఎస్ఐఆర్ గురించి అవగాహన కల్పిస్తాం





**- పోలింగ్ బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి.**
**- హుజురాబాద్ ఆఫీసులో సర్ పై నాయకులకు అవగాహన..**
**-ముఖ్య అతిథిగా హాజరైన కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,వొడితల ప్రణవ్ బాబు.**

హుజురాబాద్ / వీణవంక మే 29( తెలంగాణ పత్రిక).

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్ గురించి వాడ వాడల ప్రజలకు అవగాహన కల్పించి ముందుకు వెళ్లాలని దానికోసం పోలింగ్ బూత్ ఏజెంట్లు పకడ్బందీగా కృషి చేయాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సర్ కో ఆర్డినేటర్ (సమన్వయ కర్త) కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో సర్ పై అవగాహన కార్యక్రమాన్ని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ. హుజురాబాద్ లో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఉందని దాన్ని అలాగే కొనసాగించాలని, ప్రజాస్వామ్యంలో ఓటు అనేది చాలా ముఖ్యమని సర్ పేరుతో బీజేపీ చేస్తున్న వాటిని కాంగ్రెస్ కార్యకర్తలుగా ప్రజల ఓటు హక్కు కాపాడాలనికోరారు. హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింట్ బూత్ లలో కాంగ్రెస్ నాయకులు సర్ పై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, వైస్ ఛైర్మన్ అంజలి, కౌన్సిలర్లు, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, దేవస్థాన చైర్మన్లు, డైరెక్టర్లు, అన్ని మండలాల అధ్యక్షులు, అధ్యక్షురాల్లు, బ్లాక్కాంగ్రెస్, ఎస్సీ, మైనారిటీ, సేవాదళ్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు





**-తడిసిన ధాన్యం సేకరణకు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**
**-ఇప్పటి దాకా 80 శాతం సేకరణ పూర్తి**
**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 29, తెలంగాణ పత్రిక

తడిసిన ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, తూకం వేసి తరలించడానికి సిద్ధంగా ఉన్న బస్తాల వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ సారి వరి దిగుబడి, కొనుగోలు కేంద్రాలకు రాక పెరిగిందని, జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటి దాకా 80 శాతం కొనుగోలు చేశామని తెలిపారు. డీఆర్డీఓ, సహకార శాఖ, మెప్మా, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలు ధాన్యం, గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేసేలా మండలాలకు ప్రత్యేక అధికారులు, అన్ లోడింగ్ వద్ద అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ పై ప్రతి రోజు ఉదయం అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తూ.. కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో కొంత వర్షం కురిసిందని, దీంతో తాను తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించానని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అపరల్ పార్క్, గోదాములకు తరలించి.. అక్కడ అన్ లోడింగ్ చేయిస్తున్నామని, హమాలీలకు నీరు, ఆహారం అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షం కారణంగా తడిసిన ధాన్యం సేకరణ విషయంలో ఇబ్బందులు లేవని, రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు. తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించడానికి వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని, సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పరిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# కోటగిరిలో 5వ రోజు వివోఏల సమ్మెకు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు





కోటగిరి తెలంగాణ పత్రిక మే 29.

కోటగిరి మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ముందు 5 వ రోజు దీక్షలు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఐకెపి వివోఏ లకు బి.ఆర్.ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో దీక్ష శిబిరాన్ని సందర్శించి, దీక్షల్లో కూర్చోవడం జరిగింది. వివోలతో సమస్యలపై చర్చించడం జరిగింది. గతంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే సీతక్క వివోఏలకు కనీసం 28 వేల రూపాయల నెలసరి వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, హెచ్ఆర్ పాలసీ వర్తింప చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలనీ అసెంబ్లీలో డిమాండ్ చేయడం జరిగింది. నేడు అదే శాఖకు మంత్రిగా కొనసాగుతున్న సీతక్క తక్షణమే ఐకెపి వివోఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బి ఆర్ ఎస్ కోటగిరి మండల నాయకులు తెల్ల రవికుమార్ డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చేందుకు ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు తక్షణమే వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజులలో ప్రభుత్వ ఉద్యోగులంతా రోడ్ ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఉద్యోగులకు యువకులకు మహిళలకు అన్ని వర్గాల ప్రజలకు ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇవ్వడం జరిగింది అని మండిపడ్డారు. తక్షణమే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి అని డిమాండ్ చేశారు. వివిఓలతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలి అని లేనట్లయితే వారి ఆందోళనకు సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు మోరే కిషన్ సమీర్ నజీర్ కప్ప సంతోష్ శంకర్ గౌడ్ బేగారి మారుతి ఉమాకాంత్ యోగేష్ దత్తు మసూద్ వజాద్ రహీం మేత్రి గంగాధర్ శివ బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు మండల వివోఎల ఉద్యోగ సంఘం నాయకులు వివోఏల కమిటీ సభ్యులు వివిధ గ్రామాల వివోఏలు తదితరులు పాల్గొన్నారు

# మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్







**-ఎస్‌హెచ్‌జీ మహిళలకు భారీగా బ్యాంక్ లింకేజ్ రుణాలు పంపిణీ**
**-ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాలు**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 29, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్కే ఫంక్షన్ హాల్‌లో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మెగా బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా 337 మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.40 కోట్ల రుణాలు, ఎఫ్‌పీసీ, ఎఫ్‌పీజీ సీఐఎఫ్ కింద 42 సంఘాలకు రూ.1.05 కోట్లు, శ్రీనిధి రూరల్ కింద 278 సంఘాలకు రూ.7.13 కోట్లు, మెప్మా బ్యాంక్ లింకేజీ ద్వారా 55 సంఘాలకు రూ.6.33 కోట్లు, శ్రీనిధి మెప్మా ద్వారా 61 సంఘాలకు రూ.1.50 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న మహిళా సంఘాలకు రూ.11,36,113 కమిషన్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగాప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.57 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు మంజూరు చేశామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీ శ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 60 శాతం మహిళా సంఘాలకే బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ప్రతి పథకంలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ ద్వారా కోటి మంది మహిళలకు లబ్ధి చేకూర్చామని, సిరిసిల్ల జిల్లాలో 37 వేల మందికి చీరలు అందిస్తున్నామని వెల్లడించారు. రెండో దశలో మరో కోటి చీరలకు ఆర్డర్ ఇచ్చినట్లు తెలిపారు.మహిళా సంఘాలకు మంజూరు చేసిన బస్సుల ద్వారా ప్రతి నెల రూ.68 వేల వరకు ఆదాయం వస్తోందన్నారు. మహిళా సంఘాలకు ఎరువుల దుకాణాలు, ప్రతి మండలానికి ఒక రైస్ మిల్లు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. మహిళా సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలు తీసుకునే రుణాలను స్వయం ఉపాధి, వ్యాపారాల కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లాలో మహిళా సంఘాల ఎన్‌పీఏ శాతం చాలా తక్కువగా ఉందని, ఉత్తమ పనితీరుకు జిల్లాకు అవార్డు కూడా వచ్చిందన్నారు. తినుబండారాలు, కిరాణా షాపులు, మగ్గం వర్క్ తదితర ఉపాధి రంగాల్లో రుణాలను వినియోగించాలని సూచించారు.మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు కేటాయించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మహిళా సంఘాల ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు, వీర్నపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జునరావు, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖని జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్కోయ శ్రీ హర్ష







**-రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**
**-రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కట్టింగ్ పెట్టొద్దు**

పెద్దపల్లి, ప్రతినిధి మే29 ( తెలంగాణ పత్రిక )

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, రైస్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరి ఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల శారద నగర్, గౌతమి నగర్‌లోని శ్రీరామ రైస్ మిల్, రాజరాజేశ్వర రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూగోదావరిఖని జనరల్ ఆసుపత్రిలోని రక్ష పరీక్ష కేంద్రంలో సమయం ముగిసిందని ఏ రోగిని వెనక్కి పంపకుండా శాంపిల్స్ సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాల ప్రతిపాదనలు వెంటనే అందించాలని సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గైనిక్ ఓపీని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం శారద నగర్ లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ ఇంటర్మీడియట్ ఫలితాలు, స్టడీ రూమ్ సౌకర్యం, అడ్మిషన్లు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫెకళాశాలకు అవసరమైన పరికరాల ప్రతిపాదనలు అందించాలని తెలిపారు.అనంతరం గౌతమి నగర్‌లోని శ్రీరామ రైస్ మిల్, రాజరాజేశ్వర రైస్ మిల్లులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రైతుల ధాన్యంపై ఎలాంటి కట్టింగ్ పెట్టడానికి వీలు లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లారీలను ఎప్పటికప్పుడు దించుకోవాలని, ఎక్కువ సమయం వేచి ఉండే పరిస్థితి కల్పించవద్దని మిల్లర్లను ఆదేశించారు.ఈ పర్యటనలో డాక్టర్ లు అరుణ ,కృపాభాయి, రాజు ,సంబంధిత అధికారులు ,తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్య వైశ్య మహాసబ ఉపాధ్యక్షులు గా గౌరీశంకర్

**-నియామక పత్రం అందజేసిన అధ్యక్షులు లక్ష్మి నారాయణ.**

పాలకుర్తి/తొర్రూరు(తెలంగాణ పత్రిక) ప్రతినిధి పున్నం సారయ్య



తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణానికి చెందిన ప్రొద్దుటూరీ గౌరీ శంకర్ ను రాష్ట్ర అధ్యక్షులు అమరవాది. లక్ష్మీనారాయణ , హైదరాబాద్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేసినారు. అమరవాది లక్ష్మీనారాయణ కు చేదోడు వాదోడుగా అతను చేసే కార్యక్రమాలలో ముందుండి ఉమ్మడి వరంగల్ జిల్లాలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుని ఆర్యవైశ్య సంఘంలో వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలలో ముందుండి పాల్గొనే వ్యక్తి ప్రొద్దుటూరి. గౌరీ శంకర్. గౌరీ శంకర్ గతంలోరాష్ట్రఉపాధ్యక్షులుగా ఈసారి రెండవసారిగా నియామక పత్రం అందుకోవడం ఆర్యవైశ్య ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. ఆర్యవైశ్యులకు ఏ సహాయ సహకారాలు అందించుటలో ముందుండే గౌరీ శంకర్ ఎన్నో ఉన్నత శిఖరాలకు అందుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్యవైశ్య సోదరులు ఆశిస్తున్నారు.

## రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**-రోడ్డు భద్రత చర్యలను పటిష్టంగా అమలు చేయాలి**
**-కొత్త డిపో సమీపంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి**
**-రోడ్డు ప్రమాదాలపై అంబులెన్స్ స్పందన సమయ నివేదిక సిద్ధం చేయాలి**




పెద్దపల్లి, ప్రతినిధి మే29( తెలంగాణ పత్రిక )

జిల్లాలో రోడ్డు భద్రత చర్యలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీతో కలిసి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ కొత్త డిపో సమీపంలో బస్ స్టాండ్ రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన ప్రణాళిక రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.రోడ్డు భద్రతకు సంబంధించిన పనులను ప్రాధాన్యతగా తీసుకుని అమలు చేయాలని తెలిపారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అవసరమైన హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల సమయంలో అంబులెన్స్ స్పందన సమయంపై ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద స్థలానికి అంబులెన్స్ చేరుకునే సమయం, ఎదురవుతున్న ఇబ్బందులు, తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక అందించాలని తెలిపారు.అవసరమైన చోట్ల విద్యుత్ టవర్లు, విద్యుత్ స్తంభాలను సక్రమంగా మార్పిడి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారుల పరిశుభ్రతను ప్రతిరోజూ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ భవ్ సింగ్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కమలాపురం హెల్త్ సెంటర్ వద్ద అస్వచ్ఛత - ఇబ్బందుల్లో రోగులు

మంగపేట, మే 29 (తెలంగాణ పత్రిక):



ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయం పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. స్థానిక ప్రభుత్వ హెల్త్ సెంటర్‌కు ఆనుకుని ఉన్న ఒక చికెన్ సెంటర్ వద్ద జీవాలను కోసిన అనంతరం, వాటి తోలు, మాంసాహార వ్యర్థాలను అక్కడికక్కడే వదిలివేస్తుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, మహిళలు, చిన్నారులు ఈ దుర్వాసన కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం లోపల కూర్చోలేని పరిస్థితి ఏర్పడిందని ఆసుపత్రి సిబ్బంది పేర్కొంటున్నారు. పరిసరాల్లో ఈగలు, దోమలు ముసురుతుండటంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై గతంలో స్థానిక నివాసితులు పలుమార్లు కోరినప్పటికీ దుకాణ నిర్వాహకులలో మార్పు రాలేదని, అధికారులు కూడా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేయించాలని కమలాపురం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలి - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిధి మే 29:



ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్--2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇంచార్జ్ ఆర్డిఓ ప్రతాప్ హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా ఉంటాయని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బి ఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతుండగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ఏ ఈ ఆర్ ఓ లు, బి ఎల్ ఓ లు, సూపర్వైజర్లు, ఎలక్షన్ తహసిల్దార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్యే రాక

తానూర్:29మే(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రంలోని డాంగపల్లి మార్కెట్ కమిటీ గోదాంలో ఉదయం 9 గంటలకు జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రామారావు పాటిల్ ప్రారంభిస్తారని, అలాగే 9.30నిమిషాలకు తానూర్ రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్, చెక్కుల పంపిణీ ఉంటుందని బిజెపి మండల అధ్యక్షుడు పూంద్ర లక్ష్మణ్ రెడ్డి ప్రకటనలో తెలిపారు.

## తానూర్ మండల సమైక్య కార్యాలయంలో స్నేహ ప్రోగ్రాం నిర్వహణ

తానూర్:29మే(తెలంగాణ పత్రిక)



తానూర్ మండల సమైక్య కార్యాలయంలో కిశోర బాలికల స్నేహ సంఘాల సభ్యులతో స్నేహ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా, బాలికల రక్షణ చట్టాలు, ఆరోగ్య పోషణ అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో శ్రీధర్ మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.డాక్టర్ మహేష్ మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, పోషకాహారం, రక్తహీనత నివారణపై పలు సూచనలు చేశారు. పోలీస్ శాఖ ప్రతినిధులు బాలికల భద్రతకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఏపీఎం, సులోచన ,అధ్యక్షురాలు, కార్యదర్శి, సీసీలు, అకౌంటెంట్, ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సంపద దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలి : సీపీఎం డిమాండ్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 29, తెలంగాణ పత్రిక





ప్రకృతి సంపదను అక్రమంగా దోచుకుంటున్న మాఫియాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మండల సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. చెరువుల మట్టి, కాలువల మొరం, ఇసుక అక్రమ రవాణా, చెట్ల విధ్వంసం వంటి ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర ప్రకృతి విపత్తులకు మనమే కారణమవుతామని ఆందోళన వ్యక్తం చేశారు.ఇటుక బట్టీల యాజమాన్యాలపై చర్యలు తీసుకుని అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని కోరారు. ఇటుక ధరలు అదుపు లేకుండా పెరిగిపోవడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పేదలకు అందుబాటులో ఉండేలా ఇటుక ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పేదలు, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన ఇసుక, మట్టి, మొరం వంటి వనరులపై ప్రభుత్వం అనేక నిబంధనలు విధిస్తోందని, మరోవైపు ప్రకృతి సంపదను దోచుకునే మాఫియాలకు పాలకులు సహకరిస్తున్నారని ఆరోపించారు.ఇసుక, ఇటుక, స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలను ప్రభుత్వం నియంత్రించాలని, పేదలు ఇళ్లు నిర్మించుకునేలా ధరలను స్థిరీకరించాలని కోరారు. ప్రకృతి సంపదను కాపాడుతూ పేద, మధ్యతరగతి వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

# నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, అక్రమ భూ వ్యవహారాల గుట్టురట్టు





-ముగ్గురు అరెస్ట్ సైబరాబాద్ పోలీసుల కీలక చర్య

రంగారెడ్డి సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మే 29,(తెలంగాణ పత్రిక)

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగి పోలీసులు భారీ భూకబ్జా, నకిలీ ప్రభుత్వ ఉత్తర్వుల (జీఓలు) తయారీ, అక్రమ భూ విక్రయాల ముఠాను బట్టబయలు చేశారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని కోట్ల రూపాయల విలువైన భూమిని విక్రయించేందుకు కుట్ర పన్నిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, గండిపేట మండల తహసీల్దార్ శ్రీ శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 23వ తేదీన నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గండిపేట గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 18లో ఉన్న ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా తమ పేరిట క్రమబద్ధీకరించినట్లు చూపిస్తూ నకిలీ జీఓలు తయారు చేసి వాటిని వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టు అనుమతితో నిమ్మల వేణుగోపాల్, నిమ్మల రామస్వామి, నిమ్మల రాజేష్ నివాసాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో బ్యాంకు పాస్‌బుక్కు, ఎంఓయూ పత్రాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా, గండిపేట గ్రామానికి చెందిన దశరథ్ కుటుంబ సభ్యులు నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల రామస్వామి, మంగా కలిసి సుమారు 10 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిపై అక్రమ హక్కులు కలిగి ఉన్నట్లు ప్రకటించినట్లు పోలీసులు గుర్తించారు.ఈ భూమిపై హక్కుల కోసం వారు రెవెన్యూ శాఖపై హైకోర్టును ఆశ్రయించినప్పటికీ, 2025 అక్టోబర్‌లో కోర్టు వారి పిటిషన్లను కొట్టివేసినట్లు వెల్లడైంది.అయినప్పటికీ, భూమిపై ఎలాంటి చట్టబద్ధ హక్కులు లేకపోయినా, నిందితులు బొల్ల రమేష్, బ్రహ్మానాయుడుతో కలిసి ఎకరానికి రూ.3.5 కోట్ల చొప్పున భూమిని విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో పరస్పర ఒప్పంద పత్రాలు (ఎంఓ యూలు) కుదుర్చుకుని ప్రభుత్వానికి నష్టం కలిగిస్తూ అక్రమ లాభాలు పొందేందుకు ప్రయత్నించినట్లు గుర్తించారు.ఈ భూ లావాదేవీల్లో భాగంగా సుమారు రూ.4 కోట్ల వరకు డబ్బులు తీసుకున్నట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ వ్యవహారానికి సునీల్, రాధాకృష్ణ తదితరులు మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారు. అదేవిధంగా, ప్రభుత్వ భూమిని తమ పేరిట క్రమబద్ధీకరించినట్లు చూపించేందుకు నకిలీ జీఓలు, నకిలీ పత్రాలు సృష్టించినట్లు దర్యాప్తులో తేలింది.

-అరెస్టు చేసిన నిందితులు:

నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్, అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న బొల్ల రమేష్, బ్రహ్మానాయుడు, సునీల్, రాధాకృష్ణ తదితరుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.ఈ కేసు దర్యాప్తు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కొనసాగు తోంది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ జి. హరికృష్ణా రెడ్డి, గచ్చిబౌలి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి. నరేష్ ఈ కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించినట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.



-ప్రజలకు పోలీసుల హెచ్చరిక

నకిలీ జీఓలు, తప్పుడు భూ పత్రాలు, వాట్సాప్ లేదా సోషల్ మీడియాలో ప్రచారం అయ్యే నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రజలు నమ్మవద్దని సైబరాబాద్ పోలీసులు సూచించారు. భూముల కొనుగోలు లేదా ఇతర లావాదేవీలకు ముందు సంబంధిత రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల వద్ద పూర్తి స్థాయిలో ధృవీకరణ చేసుకోవాలని సూచించారు. భూకబ్జాలు, నకిలీ పత్రాల తయారీ, మోసాలు, ప్రభుత్వ పత్రాల ఫోర్జరీ వంటి నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు..

# ఉపాధి హామి నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి





-జూన్ రెండవ వారం నాటికి మంజూరైన పనులు పూర్తి చేయాలి
-తహసీల్దార్ కార్యాలయాలు, ఇందిరా మహిళ శక్తి భవనం పనులు వేగవంతం చేయాలి
-పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి మే29 ( తెలంగాణ పత్రిక )

జిల్లాకు ఉపాధి హామి పథకం క్రింద మంజూరైన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కో య శ్రీ హర్ష మాట్లాడుతూ,జూన్ రెండవ వారం నాటికి ఉపాధి హామి పథకం క్రింద మంజూరైన నిధుల వినియోగం పూర్తి కావాలని తెలిపారు. జూన్ చివరి వరకు మంజూరైన ఉపాధి హామి పనులను ప్రత్యేక శ్రద్ధతో గ్రౌండింగ్ చేస్తూ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.జిల్లాలో నిర్మాణంలో ఉన్న నాలుగు తహసీల్దార్ కార్యాలయాల పనులను జూన్ రెండవ వారం నాటికి పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో నిర్మిస్తున్న ఇందిరా మహిళ శక్తి జిల్లా భవనం పనులను పూర్తి చేసి జూన్ 2న ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ శంకరయ్య, డి ఆర్ డి ఓ కాళిందిని, కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, డీఈలు, ఏఈలు,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు : మండల అధ్యక్షుడు గోడిశాల రామనాథం

- గతంలో మండల పార్టీ కార్యాలయానికి కిరాయి కోసం తాళం వేసిన వ్యక్తి
- నేడు మండలంలో నేనే అధ్యక్షున్ని అంటూ పత్రికల ద్వారా అబద్ధపు ప్రచారం
- పార్టీ నిబంధనల ప్రకారం త్వరలోనే మండల అధ్యక్షుని ఎంపిక ప్రక్రియ

తెలంగాణ పత్రిక, పినపాక ప్రతినిధి, మే 29.

కాంగ్రెస్ పార్టీ పేరు చెప్పుకొని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవహరిస్తూ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోడిశాల రామనాథం, కాంగ్రెస్ ఆర్గనైజింగ్ జిల్లా సెక్రెటరీ బోడ రమేష్ స్పష్టం చేశారు. ఇటీవల కొన్ని పత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశాలపై ప్రచారంలోకి వచ్చిన వార్తలపై పార్టీ అధిష్టానం ఆగ్రహంగ ఉందని, ఆ విషయాలపై సమగ్ర విచారణ అనంతరం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.పార్టీ పేరు చెప్పుకొని ఎవరైనా ప్రజలను, అధికారులను, కార్యకర్తలను బెదిరించే ప్రయత్నాలు చేస్తే కాంగ్రెస్ పార్టీ సహించదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి క్రమశిక్షణ, నియమ నిబంధనలు ఉన్నాయని, వాటికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.కొంతమంది వ్యక్తులు తమను తాము మండల అధ్యక్షులుగా ప్రచారం చేసుకోవడం, పత్రికల్లో వార్తలు రాయించుకోవడం జరుగుతోందని, ఇది పార్టీ విధానాలకు వ్యతిరేకమని రామనాథం అన్నారు. ఇప్పటికే జిల్లా నాయకత్వానికి 17 మంది అభ్యర్థులు తమ అప్లికేషన్లను ఇవ్వడం జరిగిందని, జిల్లా నాయకత్వం ఎంపిక చేసిన వారే మండల అధ్యక్షులుగా గుర్తింపు పొందుతారని స్పష్టం చేశారు. అధిష్టానం ప్రకటించబోయే మండల అధ్యక్షున్ని ప్రతి కార్యకర్త గౌరవించాలని కోరారు. గతంలో పార్టీ కార్యాలయానికి ఒక నెల కిరాయి కోసం తాళం వేసిన వారే నేడు పార్టీకి మొత్తం మేమే అని చెప్పుకోవడంహాస్యాస్పదమని అన్నారు.పార్టీ బలోపేతం, ప్రజాసమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ



కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాంగ్రెస్ నాయకుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. వ్యక్తిగత ప్రచారం కోసం పార్టీ పేరును దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ క్రమశిక్షణతో పనిచేసి పార్టీ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు కొంబత్తిని శ్రీను, భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, ఉప్పాక సర్పంచ్ బాబురావు, ఉప్పాక ఉపసర్పంచ్ కోడెం రామ్ మోహన్ రావు, సంపత్, మార్తా మనోజ్,నక్కల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను వంచించడమే 'ప్రజా పాలన' నా? కొనుగోలు కేంద్రాల్లో ముక్కిపోతు





తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మే 29:

రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ, క్షేత్రస్థాయిలో అన్నదాతలను వంచించడమే ప్రస్తుత ప్రభుత్వ "ప్రజా పాలన" నా? అని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏటూరునాగారంలోని వరి ధాన్యం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఈరోజు ఆయన సందర్శించి, గత 40 రోజులుగా ధాన్యం అమ్ముడుపోక నిరీక్షిస్తున్న స్థానిక రైతుల ఇబ్బందులను, వారి ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాకులమర్రి లక్ష్మణ్ బాబు మీడియాతో మాట్లాడుతూ స్థానిక మంత్రి మరియు అధికార యంత్రాంగం వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**-ఆయన మాట్లాడిన ముఖ్యమైన అంశాలు**

మంత్రిగారి మాటలకే పరిమితం - చేతల్లో శూన్యం స్థానిక మంత్రిగారు అధికారంలో ఉండిఏవేవో పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారే తప్ప, ఇక్కడ రైతులు పడుతున్న అసలు ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిన్ననే ఈ ప్రాంతానికి వచ్చిన మంత్రిగారు, ఒక్క పూటైనా ఈ కొనుగోలు కేంద్రానికి వచ్చి రైతుల పరిస్థితిని కళ్లారా చూసే తీరిక లేదా? అని ప్రశ్నించారు. వచ్చి చూడకుండానే వెళ్ళిపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు కొనుగోలు కేంద్రాల్లో నెల రోజులకు పైగా ధాన్యం నిల్వలు పేరుకుపోయి, అకాల వర్షాలకు తడిసి వడ్లన్నీ నల్లబడిపోతున్నాయని, ముక్కిపోతున్నాయని లక్ష్మణ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. "రైతు పండించిన పంట కళ్ల ముందే పాడవుతుంటే, ఈ వడ్లను కొనే నాథుడే లేడా?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

**-రైతాంగ పక్షాన పోరాటం :**

ప్రజా పాలన పేరిట రైతులను అగచాట్ల పాలు చేయడం సరికాదని, తక్షణమే కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు, పాలకులు స్పందించి యుద్ధప్రాతిపదికన తూకాలు వేసి మిల్లులకు తరలించకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని కాకులమర్రి లక్ష్మణ్ బాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి





**-ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి**
**-ప్రతి ఇంటికి బీఎల్వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి**
**-డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి**
**-అభ్యంతరాలు, క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలి**
**-రాజకీయ పార్టీలతో నిరంతర సమన్వయం కొనసాగించాలి**
**-ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ లతో వీడియా కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన సీఈఓ**
**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

పెద్దపల్లి,ప్రతినిధి మే29 ( తెలంగాణ పత్రిక )

ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం, మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 1950 నుంచి ఇప్పటి వరకు దాదాపు 10 సార్లు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో గతంలో 2002లో ఎస్ఐఆర్ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీల తొలగింపు జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించనున్నట్లు చెప్పారు.జూన్ 24 నుండి జూలై 25 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హ ఓటరిని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీఎల్వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని, ఎన్యుమరేషన్ సమయంలో ఎలాంటి ఆధారాలు చూపించాల్సిన అవసరం లేదని తెలిపారు.ప్రతి బీఎల్వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధివిధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 24 నుండి జూలై 25 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హ ఓటరిని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితా విడుదల అనంతరం మ్యాపింగ్‌లో లోపాలు ఉంటే సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. భారత పౌరసత్వ నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 1, 1987కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరి అయినా ఒకరి పత్రం సమర్పించాలని, డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తల్లిదండ్రుల ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తిస్థాయి నిష్పాక్షికత పాటించాలని తెలిపారు. అన్ని పార్టీలకు సమాన దూరంలో ఉండటమే కాకుండా, అది స్పష్టంగా కనిపించేలా అధికారులు వ్యవహరించాలని ఆదేశించారు.ముఖ్యంగా వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రముఖుల పేర్లు మిస్ అయ్యాయనే వార్తలు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో లు బి. గంగయ్య, సురేష్, అందరు తహసిల్దార్ లు,సంబంధిత శాఖల అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సమైక్య రుణమేల సమావేశం 31 సంఘాలకు 3 కోట్ల 92 లక్షల లోన్లు మంజూరు


**-ఏపీఎం సుభాష్ గౌడ్**

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 29 (తెలంగాణ పత్రిక):

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల కేంద్రంలో శ్రీ శక్తి భవనంలో మహిళా సమైక్య రుణమేల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించడం జరిగిందని ఏపిఎం సుభాష్ గౌడ్ ఉన్నారు. ఈ సమావేశంలో మండలంలో ఉన్న 6 బ్యాంకుల్లో 31 సంఘాలకు 3 కోట్ల 92 లక్షల లోన్లు మంజూరు చేయడానికి లెటర్ తీసుకోవడం జరిగిందని ఆయన అన్నారు. మహిళా శక్తిలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అభివృద్ధి కోసం మహిళా సంఘాలకు పెరటి కోళ్లు



పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంకు మేనేజర్ హరికిషన్ టిజిబి బ్యాంకు మేనేజర్ మధు సీసీలు సుల్తానా విజయలక్ష్మి లక్ష్మణ్ స్వప్న ఎమ్మెస్ అధ్యక్షులు రూప



కార్యదర్శి భాగ్యరాణి ఎంఎస్‌ఏ గీత ఎం సి ఓ గంగాధర్ గ్రామ సంఘాల అధ్యక్షురాలు పాల్గొనడం జరిగింది.

## ఎన్‌టీసీపీ & కోప్టా చట్టం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**-కోప్టా చట్టం అమలును పటిష్టంగా చేపట్టాలి**
**-విద్యాసంస్థలు, హాస్టళ్ల సమీపంలో పొగాకు విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి**
**-పబ్లిక్ ప్లేస్ లో ధూమపానం చేస్తే వెంటనే జరిమానాలు విధించాలి**

పెద్దపల్లి, ప్రతినిధి మే29 ( తెలంగాణ పత్రిక )



జిల్లాలో కోప్టా చట్టం-2003 అమలును పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీతో కలిసి ఎన్‌టీసీపీ & కోప్టా చట్టం అమలుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, కోప్టా చట్టం అమలు అత్యంత అవసరమని, అన్ని శాఖలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలను పొగాకు రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలల సమీపంలో ఉన్న దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. పోలీసు శాఖ సహకారంతో జూనియర్ కళాశాలలు, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు.రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు వంటి ప్రజా ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై వెంటనే జరిమానాలు విధించాలని తెలిపారు. అదే తప్పును పునరావృతం చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రతి నెలా గ్రౌండ్ లెవల్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చట్ట అమలును పర్యవేక్షించాలని సూచించారు. అన్ని పొగాకు ఉత్పత్తులపై ఆరోగ్య హెచ్చరికలు తప్పనిసరిగా ఉండాలని, కోప్టా చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

**-గ్రామపంచాయతీ ఈవో ఆన్వర్ ఆలీ**

ముధోల్: 29మే(తెలంగాణ పత్రిక)



ఇంటి నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ముధోల్ గ్రామపంచాయతీ ఈవో ఆన్వర్ ఆలీ చెప్పారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఇంటిని నిర్మించే వారు గ్రామపంచాయతీ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తదుపరి గడువు తర్వాత ఇంటి నిర్మాణం మంజూరు పత్రాన్ని యజమానికి అందించడం జరుగుతుందన్నారు. అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తే చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానాలు విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా తాపీ మేస్త్రీలు ఇంటి నిర్మాణాలకు అనుమతులు లేనట్లయితే పనులను చేయకూడదని సూచించారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

**-వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం**
**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 29, తెలంగాణ పత్రిక



జిల్లాలో జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, సంబంధిత అధికారులతో శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు పరేడ్ గ్రౌండ్ లో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.వేడుకలకు సంబంధించి జెండా ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్దం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేడుకల వద్ద వైద్య బృందాలచే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని. వేడుకలకు ఆహ్వాన పత్రాలు ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందాలని ఆదేశించారు. సిరిసిల్ల పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథి అందించే సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా తయారు చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ముఖ్య అతిథి గౌరవ వందనం, ఇతర బందోబస్తు ఏర్పాటు పకడ్బందిగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కలెక్టరేట్ ఏఓ రామ్ రెడ్డి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చేరుకూరు -ధర్మవరం రహదారి కి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని గ్రామపంచాయతీ లలో తీర్మానం చేయాలనీ సర్పంచ్ లకు వినతిపత్రం

-సిపిఎం.

వాజేడు తెలంగాణ పత్రిక ప్రతినిధి కీసరి ప్రసాద్,



వాజేడు మండలం చేరుకూరు -ధర్మవరం ఆర్ అండ్ బి రహదారి కి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని గ్రామపంచాయతీ లలో తీర్మానం చేసి ఉన్నత అధికారులకు, జిల్లా మంత్రి, అటవీశాఖ చైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులకు పంపాలని ధర్మవరం, అయ్యవారిపేట, చింతూరు, పేరూరు, చేరుకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ లకు వినతిపత్రం ఇవ్వటం జరిగింది. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు అడ్డంకులు తెలపటం తో నిర్మాణం నిలిపివేశారని, రహదారి నిర్మాణం చేపట్టక పోవటంతో గుంతలు ఏర్పడి, రహదారి ధ్వంసం అయి బస్సు, ఆటో అంబులెన్సు, కనీసం మోటార్ సైకిల్ కూడా వెళ్ళాలి అన్న 3 కిలో మీటర్ పరిధిలో నానా ఇబ్బంది పడుతున్నారు అని అనేక ప్రమాదాలు జరిగాయి అని అయినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని 2021 సంవత్సరంలో 13 కోట్లు నాబార్డు నిధులు మంజూరు కాగా అట్టి నిధులలో మిగిలిన రహదార్లు పూర్తిగా కాగా కేవలం 3కిలో మీటర్ పరిధిలో అటవీశాఖ అభ్యన్తరం తో ఆగిపోయిందని, రహదారి నిర్మాణానికి అటవీశాఖ 47,50,000 రూపాయలు నష్ట పరిహారం చెల్లిస్తే అనుమతులు ఇస్తాం అని తెలిపినట్లు ఆర్ అండ్ బి అధికారులు తెలిపారని, అట్టి నష్ట పరిహారని కి ప్రభుత్వం అటవీశాఖ కు చెల్లించి రోడ్డు నిర్మాణానికి చెర్యలు తీసుకోవాలని ఈ రహదారి పరిధిలో గ్రామపంచాయతీ లలో తీర్మానం చేసి పంపించాలని వారు మాట్లాడుతూ అన్నారు ఈ కార్యక్రమం లో నాయకులు గౌరారపు చంద్రశేఖర్, బలుసుపాటి నరేష్, ముతేబోయిన మహేందర్, నాగేంద్రబాబు తదితరలు పాల్గొన్నారు.

## దుర్గం చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మే 29,(తెలంగాణ పత్రిక)



శుక్రవారం ఉదయం సుమారు 11:00 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని మహిళ దుర్గం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందడంతో, వెంటనే మాధాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని హైడ్రా సిబ్బంది సహాయంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు.గాలింపు చర్యల్లో భాగంగా ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని దుర్గం చెరువులో గుర్తించారు. మృతురాలి వయస్సు సుమారు 25 నుండి 30 సంవత్సరాల మధ్యగా ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

**-మృతురాలి వివరాలు ఈ విధంగా ఉన్నాయి:**

చామన చాయ రంగు,నలుపు రంగు వెంట్రుకలు, నలుపు రంగు చుడిదార్ ధరించి ఉంది, క్రీమ్ కలర్ లెగ్గిన్ ధరించి ఉంది, ఈ మహిళకు సంబంధించిన ఎటువంటి ఆచూకీ తెలిసిన వారు వెంటనే మాధాపూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవలసిందిగా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

**-సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:**

మాధాపూర్ పోలీస్ స్టేషన్: 8712663109, డి. కృష్ణ మోహన్, ఎస్‌హెచ్‌వో, మాధాపూర్: 8712663100.

## రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

-రైతులకు ఇబ్బందులు కలిగితే వెంటనే స్పందించాలి
-వడ్ల కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలి
-నర్సాపూర్‌లో రైస్ మిల్లులను పరిశీలించిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 29 (తెలంగాణ పత్రిక):






రైతుల నుంచి వడ్ల కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించి వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ సూచించారు. శుక్రవారం నర్సాపూర్ ప్రాంతంలోని పలు రైస్ మిల్లులను ఆయన సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లుల్లో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజువారీ వడ్ల స్వీకరణ, లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి సాధ్యమైనంత ఎక్కువ వడ్లను ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని మిల్ యాజమాన్యాలకు సూచించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వడ్ల నిల్వ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యం వల్ల రైతులు నష్టపోకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, లోడింగ్, అన్‌లోడింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్ల కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల పరిస్థితులను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రోజువారీ వడ్ల కొనుగోలు, రవాణా వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని అదనపు ఎస్పీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ వెంట డియస్పి నరేందర్ గౌడ్, నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎసై రంజిత్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## ట్రాఫిక్ రద్దీ నివారణకు సురక్షిత విద్యార్థి రవాణా పై సైబరాబాద్ పోలీసుల ప్రత్యేక కార్యాచరణ





-తల్లిదండ్రులతో వర్చువల్ సమావేశం నిర్వహించిన సీపీ డాక్టర్ ఎం. రమేష్

రంగారెడ్డి జిల్లా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ మే 29,(తెలంగాణ పత్రిక)

సైబరాబాద్ ప్రాంతాన్ని ట్రాఫిక్ రద్దీ లేని సురక్షిత నగరంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థుల రవాణా వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకురావాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఐపీఎస్ స్పష్టం చేశారు. సేఫర్ అండ్ అఫోర్డబుల్ స్టూడెంట్ మొబిలిటీ లక్ష్యంగా రూపొందిస్తున్న ప్రత్యేక ప్రణాళికపై తల్లిదండ్రులతో యూట్యూబ్ వేదికగా నిర్వహించిన వర్చువల్ అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో వేలాది మంది తల్లిదండ్రులు, విద్యాసంస్థల ప్రతినిధులు, వివిధ భాగస్వామ్య సంస్థలు పాల్గొన్నారు. విద్యార్థులకు సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన, పారదర్శకమైన మరియు పర్యవేక్షణలో ఉండే రవాణా వ్యవస్థను అందించేందుకు "స్టూడెంట్ మొబిలిటీ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్"ను రూపొందిస్తున్నట్లు సీపీ తెలిపారు. పాఠశాలలు, కళాశాలల వద్ద పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, అసురక్షిత రవాణా విధానాలు, వాహనాల వినియోగ లోపాలను తగ్గించడం ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఈ వ్యవస్థలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ రవాణా సేవలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమన్వయం చేయనున్నారు.

అదేవిధంగా పోలీసుల ధృవీకరణ పొందిన గిగ్ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందిని విద్యార్థుల భద్రతా సహాయకులుగా వినియోగించనున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, పాఠశాలలు విడిచే సమయాల్లో కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే దాదాపు రెండు లక్షల వాహనాలు స్కూళ్ల వద్ద గుమికూడుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితి సైబరాబాద్ ఐటీ కారిడార్ ట్రాఫిక్ కంటే ఎక్కువ రద్దీని సృష్టిస్తోందన్నారు. పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లడం, తిరిగి తీసుకురావడం సమయంలో తల్లిదండ్రులు ఒత్తిడిలో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో పిల్లలను తీసుకెళ్లే విషయంలో సమాచార లోపాల కారణంగా విద్యార్థులు పాఠశాలల వద్దే ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అందుకే ఇది కేవలం తాత్కాలిక ట్రాఫిక్ పరిష్కారం కాదని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న సమగ్ర పౌర రవాణా సంస్కరణ అని స్పష్టం చేశారు. సైబరాబాద్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో 526 విద్యాసంస్థలు, సుమారు 4.1 లక్షల మంది విద్యార్థుల రవాణా వ్యవస్థలో పలు లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత "ట్రాన్స్‌పోర్ట్ ఫర్ లండన్" నమూనాను ఆధారంగా తీసుకుని ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు సీపీ వెల్లడించారు. మార్గాల ప్రణాళిక, రవాణా పర్యవేక్షణ, కేంద్రీకృత నియంత్రణ, డిజిటల్ సమన్వయం, స్మార్ట్ మొబిలిటీ నిర్వహణ వంటి అంశాలు ఇందులో భాగమవుతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పనిచేసే అన్ని వాహనాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని సైబరాబాద్ పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల రవాణా రంగంలో ఇప్పటికే సేవలందిస్తున్న ఒక స్టార్టప్ సంస్థను సాంకేతిక భాగస్వామ్య సంస్థగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రారంభ దశలో విద్యార్థుల రవాణా డేటా విశ్లేషణ, స్కూల్ గేట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ, తల్లిదండ్రుల అవగాహన కార్యక్రమాలు, నియంత్రిత మార్గాల ప్రణాళిక చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసిన ఈ సమావేశంలో సుమారు ఐదు వేల మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డీసీపీ చే. శ్రీనివాస్ ఐపీఎస్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ అదనపు డీసీపీ హనుమంతరావు, ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవీద్ ఖాన్, విద్యార్థి రవాణా రంగ ప్రతినిధులు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు..

## మంగపేటలో భారీ దొంగతనాల ముఠా గుట్టురట్టు

-ఎనిమిది మంది అరెస్ట్, రూ. లక్షల విలువైన సొత్తు స్వాధీనం

మంగపేట, మే 29 (తెలంగాణ పత్రిక):

మంగపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొంతకాలంగా ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న వరుస దొంగతనాల కేసులను స్థానిక పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. మండలంలోని గంపా నిగూడెం, కమలాపురం, బోర నర్సాపూర్ గ్రామాల్లో జరిగిన పలు చోరీ కేసులకు సంబంధించి ఎనిమిది మంది సభ్యుల అంతర్ జిల్లా దొంగల ముఠాను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నిందితులు గతంలోనూ పలు నేరాల్లో భాగస్వాములుగా ఉన్నారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా, మంగపేటతో పాటు కొత్తగూడెం, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు.

**-ఎనిమిది మంది నిందితుల అరెస్ట్**

ఈ కేసులో అరెస్ట్ అయిన వారిలో నిమ్మల వినయ్ కుమార్ (24 సంవత్సరాలు, గొల్లవాడ, మంగపేట), పరమాత్ముల శివ (25 సంవత్సరాలు, కమలాపురం), బోయ్ పరశురామ్ (27 సంవత్సరాలు, ఒడిశా కాలనీ, కమలాపురం), రాయరాకుల సారయ్య (65 సంవత్సరాలు, పాత ఇనుప సామాన్ల దుకాణం, సుభాష్ చంద్రబోస్ కాలనీ, కమలాపురం), నిమ్మల కుమార్ (28 సంవత్సరాలు, కమలాపురం), భుక్యా ప్రవీణ్ అలియాస్ బెంజ్ (28 సంవత్సరాలు, టిడిపి కాలనీ, కమలాపురం), మహమ్మద్ బిజిగిరి (27 సంవత్సరాలు, ప్రస్తుతం చిన్నబోయినపల్లి, ఏటూరునాగారం), మరియు కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన బండి తరుణ్ (24 సంవత్సరాలు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రం వంట మాస్టర్)లు ఉన్నారు.నిందితుల నుంచి పోలీసులు పెద్ద ఎత్తున దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో: ఒకటిన్నర తులాల బంగారు ఆభరణాలు,40 తులాల వెండి వస్తువులు,3 మోటార్ సైకిళ్లు,30 కేజీల రాగి వైరు,3 సెల్ ఫోన్లు మరియు రూ. 10,000 నగదు ఉన్నాయి. పోలీస్ సిబ్బందికి అభినందనలు ఈ క్లిష్టమైన కేసును సమర్థవంతంగా ఛేదించి,



నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఏటూరునాగారం అదనపు పోలీస్ సూపరింటెండెంట్ ముదితా భట్, ఏటూరునాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ. శ్రీనివాస్, మంగపేట సబ్ ఇన్స్పెక్టర్ టివిఆర్ సూరి, సబ్ ఇన్స్పెక్టర్ ఎల్. శ్రీకాంత్ మరియు కానిస్టేబుళ్లు మోహన్, రమేష్, ప్రసాద్, నరేష్, మోహన్‌లను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి వేసవి కాలంలో ఇళ్లకు తాళాలు వేసి శుభకార్యాలకు లేదా ఊర్లకు వెళ్లేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగపేట పోలీసులు సూచించారు. ఇళ్లలో ఎక్కువ మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు ఉంచకూడదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## వివోఏల దీక్షకు మద్దతు తెలిపిన తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన నాయకులు కూర సురేష్ పటేల్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 29

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న వివోఏల నిరసన దీక్షకు తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన నాయకులు జిల్లా మండల ఇన్చార్జ్ కూర సురేష్ పటేల్ వరద సతీష్ సుధాకర్ శర్మ సుమలత శర్మ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో వివోఏలు దీక్షలు చేపట్టిన సమయంలో ప్రస్తుతం మంత్రి పదవిలో ఉన్న సీతక్క మద్దతు తెలిపి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధరతో పాటు జీవిత బీమా, ఆరోగ్య బీమా కల్పించి సెల్ఫ్ ఎంప్లాయిస్‌గా గుర్తిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా వివోఏల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వివోఏలకు కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించాలని, ఆరోగ్య భద్రతతో పాటు ప్రమాద బీమా అమలు చేయాలని, ఎస్ఇఆర్ పి ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన వివోఏలను సీసీలుగా గుర్తించాలని, జీవో 58ను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు మండల వివోల సంఘం నాయకులు సంతోష మాట్లాడుతూ శాంతియుతంగా కొనసాగుతున్న దీక్షల దశలోనే సమస్యలను పరిష్కరించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ



ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు అనంతరం వివోఏలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు మమత కార్యదర్శి కీర్తి కోశాధికారి హారతి సహాయ కార్యదర్శి ఇస్లావత్ పద్మ సభ్యులు మంజుల రజిత మయూరి లక్ష్మి శిరీష సంతోష పద్మ పద్మా రెడ్డి మల్లేశ్వరి నవీన తదితరులు పాల్గొన్నారు.

# రైతులు లేకుండానే పార్టీ కార్యకర్తలతో ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్న బిఆర్ఎస్







-ఫోటో కాల్ ఇవ్వడం లేదని ప్రాధాన్యం తగ్గుతుందనే భ్రమలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే
-దిగుబడి పెరగడంతోనే ధాన్యం కొనుగోలులో జాప్యం
-టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 29 (తెలంగాణ పత్రిక): మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మీడియా సమావేశం నిర్వహించిన రాష్ట్ర టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి నర్సాపూర్ ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతుల సమస్యలను అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.

-ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ...

"నర్సాపూర్ ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి రైతుల పేరుతో రాజకీయ నాటకాలు ఆడుతున్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు రైతుల సమస్యలు ఎందుకు గుర్తుకు రాలేదు? అప్పట్లో రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని నాయకులు ఇప్పుడు రైతులపై ప్రేమ చూపిస్తున్నట్లు నటించడం హాస్యాస్పదంగా ఉంది" అని విమర్శించారు. సునీత లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేయవలసింది పోయి ఫోటో కాల్ ఇవ్వడం లేదని. ప్రాధాన్యం తగ్గిందనే భ్రమలో మాట్లాడుతున్నారు తప్ప ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి కనిపించడం లేదు. అని ధ్వజమెత్తారు "ఈసారి రైతులు కష్టపడి అధిక దిగుబడి సాధించారు. ధాన్యం ఎక్కువగా రావడంతో కొనుగోలు కేంద్రాల వద్ద కొంత జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. కానీ ఈ పరిస్థితిని బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు" అనిరాజిరెడ్డి అన్నారు. రైతులు లేకుండానే పార్టీ కార్యకర్తలతో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. "నిజంగా రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే రైతులతో కలిసి ప్రభుత్వానికి సూచనలు చేయాలి. కానీ ప్రజల్లో గందరగోళం సృష్టించడం తప్ప బీఆర్ఎస్ నాయకులు ఏమీ చేయడం లేదు" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తుందని భరోసా ఇచ్చారు. "బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉండి పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తామని గొప్పలు చెప్పింది. కానీ వేలాది మంది పేదలను ఆశలు పెట్టించి చివరకు మోసం చేసింది. ఎంతో మంది లబ్ధిదారులు ఇళ్ల కోసం ఎదురుచూస్తూ నిరాశ చెందారు" అని విమర్శించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిజంగా పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇందిరమ్మ ఇళ్లను అందిస్తోంది. ప్రారంభోత్సవాలు నిర్వహిస్తూ లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తోంది. ప్రజలకు మేలు జరుగుతుంటే చూసి ఓర్వలేక ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి అనవసర విమర్శలు చేస్తున్నారు" అని రాజిరెడ్డి మండిపడ్డారు. "ప్రజలకు సేవ చేయాల్సిన ప్రజాప్రతినిధులు అభివృద్ధిని స్వాగతించాలి గానీ, రాజకీయ ద్వేషంతో విమర్శలు చేయడం సరికాదు. బీఆర్ఎస్ నాయకులు తమ వైఫల్యాలను దాచిపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, పేదల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రజలు కూడా కాంగ్రెస్ పాలనపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని రాజిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మహేష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, రాష్ట్ర ఫిషర్మెన్ కార్యదర్శి తలారి మల్లేశం, తాజా మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సొసైటీ డైరెక్టర్ కిష్టా గౌడ్, కృష్ణ సర్పంచ్ నరేందర్ రెడ్డి, కృష్ణ, మైసయ్య, మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు బాలల అభివృద్ధికి గొడ్డలిపెట్టు





-ఏజెన్సీ ఏరియాలో 100 శాతం బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కట్టుబడి ఉండాలి.
-అదనపు ప్రాజెక్టు అధికారి కుమ్రం నాగోరావు.

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మే 29: తెలంగాణ పుత్తడి బొమ్మకు పుస్తెలు కాదు, పుస్తకాలు కావాలి, బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలి. 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో "బాల్య వివాహం -- బతుకు ఆగం" నినాదంతో బాల్య వివాహాల నిర్మూలనపై బుధవారం ఏటూరునాగారం సమావేశ మందిరంలో వివాహాల నిర్వాహకులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి. ప్రేమలత అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సు లో తాడ్వాయి, ఏటూరు నాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన పురోహితులు, ఖ్వాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, ఫ్లెక్సీ లు ముద్రించేవారు, క్యాటరింగ్ మరియు బ్యాండ్ మేళం నిర్వాహకులు తదితరులతో పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సుకు అదనపు ప్రాజెక్టు అధికారి కుమ్రశీ నాగో రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి కుమ్రశీ నాగో రావు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల అభివృద్ధికి గొడ్డలిపెట్టు అని, బాల్య వివాహాలను అరికడితేనే బాల బాలికల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని, ఏజెన్సీ ఏరియాలో 100 శాతం బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కట్టుబడి ఉండాలని, తద్వారా అందరూ కలిసి సమిష్టిగా ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఐటిడిఎ అదనపు ప్రాజెక్టు అధికారి కుమ్రశీ నాగో రావు అన్నారు. బాల్య వివాహాల సమాచారం ముందుగా తెలిసే అవకాశం పురోహితులు, ఖ్వాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు మొదలగువారికి ఎక్కువగా ఉంటుందని, వారు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సమాచారం ముందుగానే తెలిసే అవకాశం ఉన్నందున ప్రజల సహకారం ఉంటే జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనలో అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు సమ న్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి. ప్రేమలత మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య, కుటుంబ పరమైన దుష్ప్రభావాలను వివరించారు. బాల్య వివాహాలు ఒక్క వర్గానికే పరిమితం కావని, అన్ని వర్గాల్లోనూ జరుగుతు న్నాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో వయస్సు నిర్ధారణ అత్యంత కీలకమని, వివాహాల నిర్వహణకు ముందు వయస్సు నిర్ధారణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అంతకుముందు జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్ బాల్య వివాహ నిరోధక చట్టం--2006 పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిర్వహించినా, సహకరించినా, ప్రోత్సహించినా సదరు భాధ్యులకు 2 సం.లో వరకు జైలు శిక్ష, 1 లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని వివరించారు. వరుడిపై నేరం ఆధారంగా కేసు కూడా అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. చివరగా బాల్య వివాహ నిరోధక అధికారుల బాధ్యతలు, చట్టపరమైన నిబంధనలు తదితర అంశాలను వివరించారు. చివరగా ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్ది, బాలలకు స్నేహపూర్వకంగా మార్చుటకు అంతా కట్టుబడి ఉంటామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నవారికి బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై రూపొందించిన వాల్ పోస్టర్లు, కర పత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటాపురం ముత్తమ్మ, ఆరు మండలాల నుండి బాల్య వివాహ రహిత గ్రామ పంచాయతీలు గా ఎంపిక చేసిన గ్రామపంచాయతీల సర్పంచ్ లు, కార్యదర్శులు, కన్వీనర్లు అయినా అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది కృష్ణవేణి, హరికృష్ణ, సంజీవ, సుమన్, జ్యోతి, రాజు, నరేష్, డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది, ఆరు మండలాల నుండి వచ్చిన పురోహితులు, ఖ్వాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, ఫ్లెక్సీ లు ముద్రించేవారు, క్యాటరింగ్ మరియు బ్యాండ్ మేళం నిర్వాహకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగి యువకుడు మృతి

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 29



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పాల్వంచ అశోక్ అనే రైతు గడ్డి మందు త్రాగి మృతి చెందినట్లు తెలిపారు పోలీసుల వివరాల ప్రకారం కొత్తపెల్లి గ్రామానికి చెందిన పాల్వంచ అశోక్ కు భార్య లావణ్య ఇద్దరు పిల్లలు కుమారుడు శ్రేయాన్ష్ (7) కూతురు ప్రణవి (9) ఉన్నారు, భార్య లావణ్య తెలిపిన వివరాల ప్రకారం నా భర్త వ్యవసాయం చేసుకుంటూ ఉండేవాడు పొలంలో నీరు లేక పొలం ఎండిపోయి, ఈ మధ్యనే ఇందిరమ్మ ఇల్లు మొదలుపెట్టి మధ్యలోనే ఆగిపోవడం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని దిగులుతో మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులు అయినాయని, 20 తారీకు రోజున నా భర్త గడ్డి మందు తాగినాడని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేట హాస్పిటల్లో ఉంచామని శుక్రవారం రోజున ఉదయం నాలుగు గంటల సమయంలో మరణించాలని తెలిపారు ఇట్టి విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

## దెబ్బ తిన్న ఇండ్లను పరిశీలించిన రెవిన్యూ అధికారులు కాంగ్రెస్ నాయకులు



మంగపేట, మే 29(తెలంగాణ పత్రిక) మంగపేట మండలం రమణక్కపేటలో గురువారం రాత్రి కురిసిన గాలి వానకు గ్రామంలో 10 నుంచి 15 ఇండ్ల వరకు పూర్తి గా దెబ్బతిన్నాయి. ఉదయం గ్రామ కాంగ్రెస్ నాయకులు బాధితుల ఇండ్లకు వెళ్లి పరామర్శించి వారి భరోసా నిచ్చారు. 5 నుంచి 10 లక్షల మేర నష్టం జరిగినట్లు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయ కులను సంప్రదించగా వెంటనే స్పందించి ఎమ్మార్వో దృష్టికి తీసుకువెళ్లగా వారు తక్షణమే స్పందించి ఆర్ఐ ఏసు పాదంతో దెబ్బతిన్న ఇండ్లను సర్వే చేయించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితు లకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్య క్షులు ఇందారపు లక్ష్మణరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకతి సాంబశివ రావు, కోడం బాలకృష్ణ, మండల నాయకులు మంచెర్ల రాంబాబు, మాటూరు గౌరయ్య, మాటూరి నరసింహారావు, పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ-మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్



మిర్యాలగూడ ప్రతినిధి//మే 29:(తెలంగాణ పత్రిక):- నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అవసరమైన లబ్ధిదారులకు మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష - నవీన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ చెక్కులను అందజేశారు. ?ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష మాట్లాడుతూ ఆపద కాలంలో ఉన్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప వరమని కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సాయం ఎంతో భరోసానిస్తుందని వారు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్క అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా స్థానిక శాసనసభ్యులు బిఎల్ఆర్ ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఈడిఎం చల్లా దుర్గారావు



మాడుగులపల్లి//నల్గొండ//మే 29 ( తెలంగాణ పత్రిక):-

మాడ్గులపల్లి మండల కేంద్రంలోని మీసేవ ఆధార్ కేంద్రాన్ని నల్లగొండ జిల్లా ఈడిఎం ఎలక్ట్రానిక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ చల్లా దుర్గారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ సేవలు, వివిధ ధ్రువపత్రాల దరఖాస్తులు స్టేషనరీని ఆయన స్వయంగా నిశితంగా పరిశీలించారు. ప్రజలతో ముఖాముఖి తనిఖీలో భాగంగా మీసేవ సర్వీసుల కోసం వచ్చిన మండల ప్రజలతో చల్లా దుర్గారావు నేరుగా మాట్లాడారు. కేంద్రంలో సేవలు సకాలంలో అందుతున్నాయా? నిర్వాహకుల తీరు ఎలా ఉంది అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఈడిఎం చల్లా దుర్గారావు కీలక ఆదేశాలు ఈ సందర్భంగా చల్లా దుర్గారావు మాట్లాడుతూ మీసేవ కేంద్రాల్లో ప్రజలు అప్లికేషన్ చేసుకున్న తర్వాత ఆ దరఖాస్తు పత్రాలను హార్డ్ కాపీలను మళ్లీ ఎక్కడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తి కాగానే ఆన్‌లైన్ లోనే నేరుగా అప్లికేషన్ అప్‌లోడ్ అయిపోతుందని, కాబట్టి ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదని వివరించారు. కేంద్రానికి వచ్చే మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా సేవలు అందించాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని, అధిక రుసుములు వసూలు చేయకూడదని మీసేవ యాజమాన్యానికి చల్లా దుర్గారావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డిస్టిక్ మేనేజర్ శివ మీసేవ కేంద్ర నిర్వాహకులు, సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

## వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి ,మే 29, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం బీబీపేట మండలంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యం నాణ్యత, తూకం విధానం, హమాలీ సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లపై ఆరా తీశారు.అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, అవసరమైన రక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కేంద్రంలో ధాన్యం నిల్వ విధానం, ఆన్‌లైన్ నమోదు, టోకెన్ వ్యవస్థ, చెల్లింపుల వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు తీసుకొచ్చిన ప్రతి ధాన్యపు గింజకు సరైన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, బియ్యం శ్రీకాంత్ డిసిఒరామ్ మోహన్, సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## రైస్ మిల్లులో ధాన్యం దిగుబడి తీరును పరిశీలించిన కలెక్టర్



కామారెడ్డి ,మే 29 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాబీబీపేట్ మండలం లోని మహేశ్వరి రైస్ మిల్‌లో ధాన్యం దిగుబడి తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం బీబీపేట్ మండలంలోని మహేశ్వరి రైస్ మిల్‌ను సందర్శించి ధాన్యం దిగుబడి తీరును పరిశీలించారు. మిల్లుకు చేరుతున్న ధాన్యం నాణ్యత, తూకం ప్రక్రియ, నిల్వ విధానం, సీఎంఆర్ బియ్యం తయారీ పురోగతిపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే అన్‌లోడింగ్ చేసి మిల్లింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. అకాల వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం దిగుబడి శాతం, రికవరీ వివరాలు, సీఎంఆర్ లక్ష్యాల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యమైన బియ్యాన్ని నిర్దేశిత గడువులోగా అందజేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, బియ్యంశ్రీకాంత్, రైస్ మిల్లర్లు,సంబంధిత అధికారులు, మిల్ యాజమాన్యం పాల్గొన్నారు.

# రైతుల పేరుతో బి ఆర్ఎస్ రాజకీయం చేస్తుంది





-ధాన్యం కొనుగోలు పరిశీలించిన
-ధాన్యం నిలుపుదలకు గోదాములను ఏర్పాటు
-నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 29 (తెలంగాణ పత్రిక):

రైతుల పేరుతో బి ఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తుందని రైతులకు వెన్నంటు ఉండి ధాన్యం తరలించడంలో సహకరించాలి కానీ రైతులనుగేసి రోడ్డుపైకి తెచ్చి కాలయాపన చేస్తూ రాజకీయం చేస్తూ ధర్నాలు నిరసనలు వ్యక్తం చేయడం సరికాదని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన సందర్భంగా మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతం సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ధాన్యం దిగుబడి పెరగడంతో కొనుగోలు జాప్యం జరుగుతుందని దీన్ని ఆసరా చేసుకొని ప్రతిపక్ష పార్టీ అయినా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి రైతులకు సహాయం చేయాల్సింది పోయి రైతులను రోడ్డుపైకి ఈడ్చి బి ఆర్ఎస్ కార్యకర్తలతో రోడ్డుపై బైఠాయించి ధర్నాలు నిరసన వ్యక్తం చేయడం సమయసం కాదని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ఆరోపించారు. అకాల వర్షాలకు రైతులకు నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు తడవకుండా వెంటనే గోదాంలో నిల్వచేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరడం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న గోదాంలను ధాన్యం కొనుగోలు కోసం వినియోగించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పక్కనే



ఉన్న గోదాములను సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి వినియోగించుకోవడానికి జిల్లా అధికార యంత్రాంగంతో పరిశీలించి పరిగణలోనికి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి తాజా మాజీ సుధాకర్ గౌడ్ సొసైటీ డైరెక్టర్ కిష్టా గౌడ్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి మైసయ్య కృష్ణ మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫరీద్‌పేట్‌లో సర్పంచ్‌పై గ్రామస్థుల తిరుగుబాటు

-మాజీ సర్పంచ్ భాగ్యమ్మ హయాంలోనే పనులు జరిగాయని అధికారులకు వినతిపత్రం
-పోలీసు బందోబస్తు మధ్య విచారణ

కామారెడ్డి, మే 29, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్‌పేట్ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం, డూప్లికేట్ బిల్లులు, చేయని పనులకు చెల్లింపులు, ప్రైవేట్ ఆస్తులకు ప్రజా ధనం మళ్లింపు ఆరోపణలపై శుక్రవారం నిర్వహించిన జాయింట్ ఎంక్వైరీ గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉండటంతో పోలీసు బందోబస్తు నడుమ విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ ఉత్తర్వులతో జిల్లా ఆడిట్ అధికారి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా పంచాయతీ అధికారి, పాల్వంచ , మాచారెడ్డి మండలాల ఎంపీడీఓ లు గ్రామంలో పర్యటించి రికార్డులు పరిశీలించడంతో పాటు సంబంధిత పనుల స్థలాలను సందర్శించారు. ఈ సందర్భంగా దాదాపు 100 మంది గ్రామస్థులు సంతకాలు చేసిన వినతిపత్రాన్ని విచారణాధికారులకు సమర్పించారు. మాజీ సర్పంచ్ ఆశం భాగ్యమ్మ హయాంలో గ్రామపంచాయతీ నిధులతో ఇప్పటికే పూర్తయిన డ్రైనేజీలు, సీసీ రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనులను మళ్లీ కొత్త పనులుగా చూపించి నర్సింహ రెడ్డి బిల్లులు డ్రా చేసినట్లు ఆరోపించారు. గ్రామ ప్రజల తరపున సమర్పించిన ఫిర్యాదులో రూ.9,61,937 విలువైన పనులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ



అభిప్రాయాలను అధికారులకు వివరించారు. కొన్ని సందర్భాల్లో సర్పంచ్ జీడిపల్లి నర్సింహారెడ్డి, ఫిర్యాదుదారుడు మధుసుధాన్ రెడ్డి నీ తన ముందుకి తీసుకొని వచ్చిన తర్వాతే విచారణ చేయాలని చెప్పడంతోవాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అధికారులు జోక్యం చేసుకుని విచారణను కొనసాగించారు. మరోవైపు వార్డు సభ్యులు కూడా ప్రత్యేకంగా వినతిపత్రం సమర్పించి, గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, తీర్మానాలు, రికార్డుల నిర్వహణ, వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడం వంటి అంశాలపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా గ్రామస్థులు "నీ సొంత అల్లుడే నువ్వు చేసిన అవినీతిని బయటకు తీసుకొస్తున్నాడు" అంటూ చేసిన వ్యాఖ్య అక్కడ చర్చనీయాంశంగా మారింది. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విచారణ అనంతరం అధికారులు మాట్లాడుతూ, ఫిర్యాదుదారులు, గ్రామస్థులు, వార్డు సభ్యులు మరియు సంబంధిత వ్యక్తుల వాదనలు విన్నామని, సంబంధిత రికార్డులను పరిశీలించామని, పనుల స్థలాలను సందర్శించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి, తదుపరి చర్యల కోసం పంపనున్నట్లు వెల్లడించారు. గ్రామస్థులు, వార్డు సభ్యులు మాట్లాడుతూ, విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు మరియు బాధ్యులైన అధికారులపై క్రిమినల్, పరిపాలనా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

-జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు

కామారెడ్డి ,మే 29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లామద్నూర్ బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ సమావేశంలోజుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, దాతల సహకారంమరియు ఐకేఎఫ్ నిధుల ద్వారా ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చి, ఆసుపత్రిని మరింత అభివృద్ధి పరచడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న సమస్యలైన కాంపౌండ్ వాల్ నిర్మాణం, మంచాల కొరత, స్ట్రెచర్లు, బాత్రూమ్ సౌకర్యాల మెరుగుదల, తాగునీటి సదుపాయం నర్సింగ్ స్టాఫ్ కొరత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రోగులు ఎలాంటి



ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు పొందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ఆసుపత్రి పరిశుభ్రత, సమయపాలన అత్యవసర సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హాస్పత్రి వైద్యులు, హెచ్ డి ఎస్కమిటీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో చదివించండి

**-పిల్లల శారీరక, మానసిక వికాసానికి పునాది**
**-డబ్బులు అదా చేసుకోండి**
**-మగ్దుంపూర్ లో బడిబాట నిర్వహించిన ఉపాధ్యాయులు**

నంగునూరు, మే 29(తెలంగాణ పత్రిక):

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి వారి శారీరక, మానసిక వికాసానికి పునాది వేసుకోవాలని మగ్దుంపూర్ సర్పంచి పాకాల శ్రీనివాస్ తల్లిదండ్రులకు పిలుపు ఇచ్చారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్ధుంపూర్ లో శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారు ప్రసాద రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు బడి బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాకాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య ఉచితంగా అందుతుందని చెప్పారు. పిల్లల భవిష్యత్తుకు ఉజ్వల పునాది ఏర్పడుతుందని తెలిపారు. జీవన నైపుణ్యాలను నేర్చుకోవడంతో పాటు, పిల్లల్లో మానసిక, శారీరక వికాసం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయికి అనుగుణంగా విద్యా బోధన చేస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివించడం వల్ల వేల రూపాయలు అదా అవుతాయన్నారు. యూనిఫాం, పుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా ఇవ్వడమే కాక



అల్పాహారం, మధ్యాహ్న భోజనం, వాణి మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారు ప్రసాద రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్లూరి నర్సింలు, టి.విజయలక్ష్మి, లీల, కృష్ణవేణి పాల్గొన్నారు

# హామీల అమలు మరిచి ఉయ్యాలో

**-బతుకమ్మ ఆడి నిరసన తెలిపిన ఉపాధి హామీ కూలీలు**

నంగునూరు, మే 29(తెలంగాణ పత్రిక):

అదిగిచ్చి బుదిగిచ్చి ఉయ్యాలో.. హామీల అమలు మరిచి ఉయ్యాలో... అంటూ ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో నిరసన రూపంగా మారిన బతుకమ్మ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యానికి నిరసన రూపంగా ఉపాధి హామీ కూలీలు మరోసారి మలుచుకున్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కొండంరాజు పల్లిలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రదేశంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం అయిందని బతుకమ్మ ఆట పాట రూపంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం కొండంరాజుపల్లిలో పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలు విరామ సమయంలో బతుకమ్మ ఆడుతూ నిరసనను తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఉయ్యాల పాటలు పాడారు. మొక్క జొన్నలు, వడ్ల కొనుగోలులో అధికారుల వైఫల్యాన్ని, కొనుగోలు కేంద్రాల్లో పేరుకు పోయిన ధాన్యంతో రైతులు పడుతున్న కష్టాలను, మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోక పోవడంతో నష్టాలను బతుకమ్మ పాటగా మార్చి పాడుతూ బతుకమ్మ ఆడారు. రైతు బంధు వేయక పోవడం, ధాన్యానికి బోనస్ ఇవ్వక పోవడం, రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో కాకపోవడం వల్ల తాము పడుతున్న కష్టాలను ఉయ్యాల పాటలో ఏకరువు పెట్టారు. ఎన్నికలు ముందు అదిగిచ్చి బుదిగిచ్చి(అదిగించి బుదిగించి అంటే నచ్చజెప్పి లేదా గట్టిగా అడిగి) కాంగ్రెస్ పార్టీ ఓట్లు వేయించుకుందని ఉయ్యాలో పాటలో విమర్శించారు. అధికారంలోకి వచ్చాక వాటిని



అమలు చేయడం లేదని వాపోయారు. హామీలను నమ్మి ఓటేయడంతో ఎన్నడూ రాని కష్టాలు వచ్చాయని బతుకమ్మ రూపంలో తమ నిరసనను తెలియజేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాం

**-ఇప్పటికే 1.8 లక్షల క్వింటాళ్ల వడ్లు, 23వేల క్వింటాళ్ల మొక్కజొన్నలు కొనుగోలు చేశాం**
**-24 గంటల లోపే రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయి**
**-బియ్యపు మిల్లులు నిండితే మార్కెట్ గోదాముల్లో ధాన్యం నిల్వ**

నంగునూరు, మే 29(తెలంగాణ పత్రిక):

వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వడ్లు, మొక్కజొన్నల కొనుగోళ్లలో వేగం పెంచామని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి తెలియ జేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని సిద్ధన్నపేట మార్కెట్ యార్డుతో పాటు ఘనపురంలోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు ప్రక్రియను మరో వారంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 1,80,560 క్వింటాళ్ల వడ్లు, 24,060 క్వింటాళ్ల మొక్కజొన్నలు కొనుగోలు చేశామని చెప్పారు. రవాణాలో ఆలస్యం, లారీల కొరత, తేమ శాతం పేరుతో కోతలు లేకుండా చూస్తున్నామన్నారు. ధాన్యం కొనరేమోనని రైతులు ఆందోళనలు, చెందవద్దని అందరి ధాన్యం కొనుగోలు చెస్తామని తెలిపారు. ధాన్యం నిలువల కోసం అదనంగా గోదాములు ఏర్పాటు చేశామని తెలిపారు. బియ్యపు మిల్లుల్లో నిల్వ చేసే స్థలం లేకపోతే మార్కెట్ గోదాముల్లో ధాన్యం నిలువ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వర్షాలకు వడ్లు తడిసిన ప్పటికీ, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. వర్షానికి తడిసిన లేదా రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు సేకరిస్తామని తెలిపారు. ఇప్పటి దాక సేకరించిన ధాన్యానికి 24 గంటలలోపే డబ్బులు చెల్లించి ఇది పూర్తిగా రైతుల ప్రభుత్వమని రుజువు చెసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చిన సత్తయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాగు శ్రీకాంత్ యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ గంగుల రవి, మాజీ సర్పంచ్ చేర్యాల బాలయ్య, కాంగ్రెస్ నాయకులు బస్వరాజు రాములు, ఆరెపల్లి సురేశ్, పంగ రాజ శేఖరరెడ్డి, మహబూబ్, సుంకరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గౌడ విద్యార్థిని విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవాలి

**-జై గౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూడి రామారావు గౌడ్ పిలుపు**

కామారెడ్డి, మే 29, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

గౌడ సమాజ అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని, గౌడ విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని జై గౌడ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూడి రామారావు గౌడ్ పిలుపునిచ్చారు. పదవ తరగతి , ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థిని విద్యార్థులను సన్మానిస్తూ కామారెడ్డి పట్టణంలోని కర్షక్ బిఈడి కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించిన "ప్రతిభ పురస్కారాల అవార్డుల కార్యక్రమం"లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ వట్టికూడి రామారావు గౌడ్ మాట్లాడుతూ, నేటి యువత విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకుంటేనే గౌడ సమాజానికి గౌరవం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉన్నత పదవులు సాధించాలని సూచించారు. గౌడ సమాజంలోని ప్రతి కుటుంబం తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలు, మెమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు గౌడ కుల చరిత్ర, గొప్పతనం, సంస్కృతి, సంప్రదాయాల గురించి విశదీకరించారు. కౌండిన్య మహర్షి మహాత్మ్యం, గౌడ కులదేవతల వైభవం, వీరశూరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన త్యాగాలు, సమాజ సేవలను స్మరించుకున్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థులను ఉన్నత చదువులు చదివిస్తున్న తల్లిదండ్రుల కృషిని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో జై గౌడ ఉద్యమం రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణ గౌడ్, అధికార ప్రతినిధి దత్తాత్రి గౌడ్, యూత్ అధ్యక్షుడు క్రాంతి కుమార్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర యూత్ విభాగం అధ్యక్షులు బొమ్మగోని శంకర్ గౌడ్, కేశవ్ గౌడ్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోళ్ళ మురళి గౌడ్, ప్రధాన కార్యదర్శి అంకన్నగారి శ్రీనివాస్ గౌడ్, పెద్ద మల్లారెడ్డి సొసైటీ చైర్మన్ రాజా గౌడ్, ఇందూరి సిద్ధా గౌడ్, కర్రోల్ల శేఖర్ గౌడ్, బొంబోతుల నరేష్ గౌడ్, ప్రకాష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, సుదర్శన్ గౌడ్, రామా గౌడ్, సురేష్ గౌడ్, దేవేందర్ గౌడ్ లతో పాటు భారీ సంఖ్యలో గౌడ సోదర సోదరీమణులు, విద్యార్థులు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ

పాపన్నపేట, మే 29, (తెలంగాణ పత్రిక)





పాపన్నపేట మండలంలోని అర్హులైన 104 మంది లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల కింద మొత్తం రూ. 1,04,12,064 విలువైన చెక్కులను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులకు ఏర్పాట్లు కల్పించని పాపన్నపేట తహసీల్దార్



పాపన్నపేట,మే 29:(తెలంగాణ పత్రిక ):

ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమంలో సరిపోని గదిలో తహసీల్దార్ ఏర్పాటు చేయడంపై ప్రజా ప్రతినిధులు,లబ్దిదారులు అసహనం వ్యక్తం చేశారు.శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ గదిలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు చేతుల మీదుగా చెక్కులు అందుకోవాలని వచ్చిన లబద్ధిదారులు ఒకరిపై ఒకరు పడే విదంగా ఉండడంతో ప్రజా ప్రతినిధులు ఆరు బయటే నిలుచొవలసి వచ్చింది.సరిపోని గదిలో వంద మందికిపైగా లబ్ధిదారులతో నిర్వహించిన చెక్కుల పంపిణి కార్యక్రమం అస్తవ్యస్థంగా మారింది."అరవైలో వంద" అన్నట్లుగా చిన్న సమావేశ మందిరంలో భారీ సంఖ్యలో లబ్ధిదారులను కూర్చోబెట్టడంతో ప్రజా ప్రతినిధులు లబ్దిదారులు, కార్యకర్తలు,తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎమ్మెల్యే పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యుత్ సరఫరా పదేపదే నిలిచిపోవడంతో చీకట్లోనే కార్యక్రమం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.కరెంట్ దోబూచులాటతో లబ్ధిదారులు,అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడ్డారు. సరిపడా ఏర్పాట్లు లేకపోవడంతో కొందరు ప్రజాప్రతినిధులు, మహిళలు సమావేశ మందిరం బయటే నిలబడాల్సి వచ్చింది. లబ్ధిదారులకు చెక్కులు అందజేసే కార్యక్రమం కోసం ముందస్తు ప్రణాళిక లేకుండా అధిక సంఖ్యలో ప్రజలను పిలవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.కనీసం తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ బ్యాకప్ వంటి సౌకర్యాలు కూడా లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

## సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ - ఎమ్మెల్యే బిఎల్ఆర్




మిర్యాలగూడ ప్రతినిధి//మే 29:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధి దారులకు శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు..ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మిర్యాలగూడ మండలం, వేములపల్లి మండలం, మాడ్గులపల్లి మండలం మరియు మిర్యాలగూడ పట్టణానికి చెందిన 150 మంది లబ్ధిదారులకు మొత్తం 60 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాడ్గులపల్లి మండలానికి చెందిన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ వరంలాంటిదని తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయాన్ని సకాలంలో అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, ఆపదలో ఉన్న ప్రతి పేదవాడిని ఆదుకోవడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రూ.5వేల ఆర్థిక సాయం అందించిన హరీశ్ రావు



**నంగునూరు, మే 29(తెలంగాణ పత్రిక):**
సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన దేవులపల్లి హరిబాబు కూతురు శిరీష గురువారం అనారోగ్యంతో మరణించింది. విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్ రావు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు పీఏసీఎస్ ఛైర్మన్ కోల రమేశ్ గౌడ్, నంగునూరు సర్పంచ్ సానాదుల బాల పోచయ్య, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు చౌడుచర్ల జయపాల్ రెడ్డి తదితరుల ద్వారా ఆర్థిక సహాయం పంపించారు. వారు శుక్రవారం హరిబాబు కుటుంబాన్ని పరామర్శించి అంత్య క్రియలకు రూ.అయిదు వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోల శ్రీధర్ గౌడ్, , కోల మహేందర్ గౌడ్, ఎండి రహీం పాష, శ్రీనివాస్ గౌడ్, మాదిగ సంఘం అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్, దేవులపల్లి కనకయ్య, అయిలయ్య, దేవులపల్లి కృష్ణ, నరేశ్, బిక్షపతి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన పాలిసెట్ కౌన్సెలింగ్

**-192 మంది విద్యార్థుల ధ్రువ పత్రాల పరిశీలన**



**నంగునూరు, మే 29(తెలంగాణ పత్రిక):**
పాలీసెట్ - 2026 ప్రవేశాల కౌన్సెలింగ్ శనివారం ప్రారంభమైంది. రాజగోపాల పేటలోని సిద్ధిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ లో పాలిసెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం అయ్యింది. ఎస్సెస్సీ, పాలీసెట్-2026లో ఉత్తీర్ణులై ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థుల ధ్రువ పత్రాలను పరిశీలించి లాగిన్ ఐడీ కేటాయించారు. పాలీసెట్ - 2026ను ఈ నెల 13వ తేదిన నిర్వహించారు. ఈ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులు అయిన వారికి ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం శనివారం ప్రారంభం అయిన కౌన్సిలింగ్ జూన్ 1 వ తేదీ వరకు జరుగుతుందని రాజగోపాల పేట పాలిటెక్నిక్ ప్రధానాచార్యుడు, పాలిసెట్ కౌన్సిలింగ్ సమన్వయకర్త అలుగోజు గోవర్ధన్ తెలిపారు. స్లాట్ విధానంలో నిర్వహించే ఈ కౌన్సెలింగ్ లో విద్యార్థులకు సంబంధించిన వివిధ రకాల ధ్రువపత్రాల పరిశీలన చేస్తారని తెలిపారు. అనంతరం వెబ్ ఆప్షన్స్ కు సంబంధించిన సూచనలు ఇస్తారని తెలియజేశారు. విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనలో 192 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. సిద్ధిపేట జిల్లాలో రాజగోపాలపేట పాలిటెక్నిక్ తో పాటు, చిన్నకోడూరు మండలంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, హుస్నాబాద్ లోని ప్రభుత్వ పాలిటెక్నిక్, చేర్యాల లోని ప్రభుత్వ పాలిటెక్నిక్, గజ్వేల్ లోని ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ లలో హెల్ప్ లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారని తెలిపారు.ఈ కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రధానాచార్యుడు అలుగోజు గోవర్ధన్ ఆధ్వర్యంలో బి.అభినవ్ పర్యవేక్షణలో జరిగింది. వై.రాజు, వి.రామకృష్ణ, సయ్యద్ షహబాజ్, పాతూరి శ్రీనివాస రెడ్డి, రాజమౌళి, విజయకుమార్, శ్రీనివాస్, జ్యోతి, మధుబాబు, దీపిక, వేణుమాధవ్ తదితరులు విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించారు.

## వాష్‌రూమ్‌లో లభ్యమైన చిన్నారికి "ఆదర్శిని"గా నామకరణం

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 29, తెలంగాణ పత్రిక**



రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల కొత్త బస్టాండ్ సమీపంలోని వాష్‌రూమ్‌లో నిర్లక్ష్యంగా వదిలివేయబడిన స్థితిలో అప్పుడే పుట్టిన ఓ చిన్నారిని స్థానికులు గుర్తించి వెంటనే పోలీసుల సహాయంతో ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు సమాచారం అందించి, చిన్నారి సంరక్షణ కోసం సిబ్బందిని నియమించారు. అప్పటి నుంచి ఐసీపీఎస్, సీహెచ్ఎల్, సఖి టీం సభ్యులు ప్రతిరోజూ చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ సేవలు అందించారు.ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సహకారంతో పుట్టినప్పుడు 1500 గ్రాముల బరువు ఉన్న చిన్నారి ప్రస్తుతం 2700 గ్రాములకు చేరుకొని ఆరోగ్యంగా ఉందని అధికారులు తెలిపారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ సూచన మేరకు చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఈరోజు డిశ్చార్జ్ చేసి,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు కరీంనగర్‌లోని శిశు గృహానికి తరలించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి సూచనతో సీడబ్ల్యూసీ, మిషన్ వాత్సల్య సిబ్బంది, ఆసుపత్రి బృందం కలిసి చిన్నారికి "ఆదర్శిని" అని నామకరణం చేసి బారసాల కార్యక్రమం నిర్వహించారు. చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను గుర్తించేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లభించలేదని అధికారులు వెల్లడించారు.

# రాఘవపూర్‌లో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**-జూన్ 2 నాటికి ఇందిరా మహిళా శక్తి భవనం ప్రారంభానికి సిద్ధం చేయాలి**

**పెద్దపల్లి, ప్రతినిధి మే29 ( తెలంగాణ పత్రిక )**
జూన్ 2 నాటికి ఇందిరా మహిళా శక్తి భవనం ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లాకలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.పెద్దపల్లి మండలం రాఘవపూర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి జిల్లా స్థాయి భవనం పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మహిళా సంఘాలకు సొంతంగా భవనం ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జిల్లా స్థాయి ఇందిరా మహిళా శక్తి భవనాన్ని నిర్మిస్తోందని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నూతన భవనాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. భవనంలో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, సమావేశాల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ప్రతి పనిని పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. భవన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.



మహిళా సంఘాల అభివృద్ధికి ఉపయోగపడేలా జిల్లా స్థాయి ఇందిరా మహిళా శక్తి భవనంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి జూన్ 2న ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాలిందిని, ఈఈ పంచాయతీరాజ్ శంకరయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 15 ఎకరాల పశుగ్రాసాన్ని రెండు లక్షల విలువైన గడ్డిని ధ్వంసం చేసిన దుండగులు

**-రైతుల ఆస్తులను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి మాజీ ఎమ్మెల్యే తిప్పన**

**మిర్యాలగూడ ప్రతినిధి //మే 29:(తెలంగాణ పత్రిక):-**
మిర్యాలగూడ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు చౌగాని బిక్షం గౌడ్ కి చెందిన 15ఎకరాల పశు గ్రాసాన్ని దాదాపు 2లక్షల విలువైన గడ్డిని నిన్న అర్ధరాత్రి కొంతమంది దుండగులు ఉద్దేశపూర్వకంగా కావాలనే ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి ఘాటుగా ఖండించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామ వాతావరణాన్ని చెడగొట్టేందుకు కుట్రపూరితంగా ఇటువంటి చర్యలకు పాల్పడడం బాధాకరమని అన్నారు. రైతులు కష్టపడి సాగు చేసిన పశుగ్రాసాన్ని ధ్వంసం చేయడం ద్వారా భయాందోళనలు సృష్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఏఎంసీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబు నాయక్, మాజీ వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, నియోజకవర్గ నాయకులు వింజం శ్రీధర్ డిమాండ్ చేశారు. రైతుల ఆస్తులను ధ్వంసం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టవద్దని, గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని వారు పేర్కొన్నారు. కానీ గతంలో కూడా ఇటువంటి చర్యలకు పాల్పడితే కనీసం పోలీస్ శాఖ వారు ఎటువంటి చర్య తీసుకోకపోవటం చాలా బాధాకరమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రంగా రెడ్డి, కొనకంచి శేఖర్ రావు, వెలిచేతి రామకృష్ణ, ధనావత్ శంకర్ నాయక్, కృష్ణ నాయక్, పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలి

**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 29, తెలంగాణ పత్రిక**
ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.ఎస్ఐఆర్--2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా ఉంటాయని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీ ఎల్ ఓ లు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతుండగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.కార్యక్రమంలో రెవెన్యూ, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పొగాకు వాడకాన్ని నివారించేందుకు చర్యలు





**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 29, తెలంగాణ పత్రిక**
జిల్లాలో పొగాకు వాడకం నివారించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ నెల 31వ తేదీ ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి నిర్వహించారు.
పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వివిధ శాఖల వారు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వివరించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని పేర్కొన్నారు.జిల్లాలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని, అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు మహిళలు, యువత, రైతులను భాగస్వామ్యం చేస్తూ పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని ఆదేశించారు.పొగాకు ఉత్పత్తుల చట్టం ప్రకారం 18 సంవత్సరాల కంటే చిన్న పిల్లలకు అమ్మడం నేరమని, ఈ చట్టాలు పకడ్బందీగా అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష, ఎన్ జీ ఓ మెంబర్ భాస్కర్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143